
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 15 ఫిబ్రవరి 2024




బీజేపీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి నేడు రాక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 14: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి గురువారం జిల్లాకు వస్తున్నారు. విజయమహల్ గేట్ దగ్గర ఉన్న కృష్ణసాయి కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న క్లస్టర్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరవుతారు. నెల్లూరు, ఒంగోలు, చిత్తూరు, తిరుపతి, రాజంపేట జిల్లాలకు సంబంధించిన క్లస్టర్ సమావేశంలో అంతర్గత విషయాలపై ఆమె నాయకులతో చర్చించనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఐదు జిల్లాల నాయకులకు పలు సూచనలు చేయనున్నారు.

ఫ్యాన్‌కు ఎదురుగాలి

గత ఎన్నికల్లో పదికి పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను గెలుచుకున్న వైసీపీ ఈ ఎన్నికల్లో చతికిలపడే సూచనలు కనిపిస్తున్నాయి. వైసీపీ కోటలు పేకమేడల్లా కుప్పకూలే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) ఫ్యాన్ ఉక్కపోతను తట్టుకోలేక సైకిల్ ఎక్కడానికి సిద్ధమవడంతో జిల్లాలో వైసీపీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పలు నియోజకవర్గాల్లో కేవలం వీపీఆర్ కారణంగా సద్దుమణిగిన అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా వైసీపీని చుట్టుముట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- కుప్ప కూలుతున్న వైసీపీ కోటలు
- టీడీపీలో చేరికకు వీపీఆర్ సుముఖం
- ఆయన వెంటే మరికొందరు నాయకులు?
- మాగుంట, మహీధర్ చూపు కూడా 'దేశం' వైపే!
- అధికార పార్టీకి కొత్త సమస్యలు
- జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికో!?



నెల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి ఎంతో విధేయుడిగా ఉన్న తనను ఎన్నికల్లో ఓడించడానికి జరిగిన కుట్రకు అధిష్ఠానం సహకరించిందని వీపీఆర్ భావించారు. వాస్తవానికి ఈయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇష్టం లేదు. అయితే, పార్టీ అధినేత, సీఎం జగన్ ఖచ్చితంగా పోటీ చేయాల్సిందేనని కోరడంతో బరిలో నిలిచేందుకు సిద్ధపడ్డారు. ఈ మేరకు ఎన్నికల ప్రచార ప్రక్రియ కొనసాగిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో ఉన్న వైసీపీ అసమ్మతివర్గాలను చక్కదిద్దుకున్నారు. అన్నీ సిద్ధం చేసుకుని పూర్తిస్థాయిలో పోటీకి సిద్ధపడిన సమయంలో ఆయన విజయావకాశాలను దెబ్బతీసేలా సొంత పార్టీకి చెందిన పెద్దలే కుట్ర చేయటంతో తీవ్ర వేదనకు గురయ్యారు. తనకు మాటమాత్రం కూడా సమాచారం ఇవ్వకుండా పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడం, కుట్ర పూరితంగా ఇదంతా చేయడాన్ని వీపీఆర్ జీర్ణించుకోలేకపోయారు. దీంతో కొంతకాలంగా ఆయన మౌనంగా ఉంటున్నారు. ఈ తరుణంలో ఆయన సన్నిహితుల సూచనలు, తెలుగుదేశం పార్టీ ఆహ్వానం మేరకు టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ ప్రభావం ఇప్పుడు వైసీపీ మీద పడుతోంది. ఆయన వెంట నడవటానికి పలువురు సిద్ధమవుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఒక బలమైన నాయకత్వం ఆయన వెంట వెళ్లడానికి సన్నాహాలు చేసుకొంటోంది. ఆత్మకూరు, కోవూరు, కావలి, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు వీపీఆర్ వెంట టీడీపీలో చేరే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో పలువురు కార్పొరేటర్లు కూడా వీపీఆర్ వెంట నడవటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఊహకందని రీతిలో..

నెల్లూరులో తెలుగుదేశం పార్టీ ఊహకందని రీతిలో అనూహ్యంగా బలపడుతోంది. రాజకీయంగా, ఆర్థికంగా ప్రజా సంబంధాల పరంగా బలమైన కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నాయి. వీపీఆర్‌తోపాటు మాగుంట కుటుంబం, కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిలు కూడా టీడీపీలో చేరుతున్నారన్న ప్రచారం వైసీపీలో తుఫాన్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. రాజకీయంగా మాగుంట కుటుంబానికి నెల్లూరు జిల్లాలో మంచి పేరుంది. ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ నియోజకవర్గాల్లో ఈ కుటుంబానికి అభిమానులు, అనుచరులు ఉన్నారు. కుందుకూరులో మహీధర్‌రెడ్డికి ఎంత పట్టుందో ఆయ రాజకీయ చరిత్రే చెబుతుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా వైసీపీపై తిరుగుబాటు జెండాను ఎగరేసిన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు బలమైన రాజకీయ నేపథ్యం కలిగినవారు. వీరి చేరికతో టీడీపీ బలం పుంజుకుంది. ఇప్పుడు అంతేస్థాయిలో గుర్తింపు పొందిన వీపీఆర్, మాగుంట, మహీధర్‌రెడ్డిలు టీడీపీలో చేరనుండటంతో ఆ పార్టీ మరింత బలోపేతం కానుంది.

వైసీపీకి కొత్త చిక్కులు

వైసీపీని వీడాలన్న వీపీఆర్ నిర్ణయం ఆ పార్టీకి కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. వీపీఆర్ స్థానంలో పార్లమెంటుకు మరో అభ్యర్థిని వెదుక్కోవాల్సి ఉంది. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ లేదా నెల్లూరు రూరల్ జగన్ ఎక్కడ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని ప్రకటించారు. ఆదాలకు ఎంపీ స్థానానికి పంపే క్రమంలో రూరల్‌కు కొత్త అభ్యర్థిని వెతుక్కోవాలి. ఒకవేళ ఆదాల రూరల్ నుంచే పోటీ చేయాల్సి వస్తే ఎంపీ స్థానానికి మరొకరిని ఎన్నుకోవాల్సి ఉంది. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొత్త వారిని నియమించాల్సి ఉంది. ఈ నియామకం గోరుచుట్టుపై రోకలిపోటు చందం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎన్నికల సమయం కావడంతో జిల్లా పార్టీని సమర్థవంతంగా నడిపే నాయకుడు లేకపోతే అది ప్రమాదమే. ఇలా గత నాలుగేళ్ల ఎనిమిది నెలలపాటు అధికార హోదాలో ఒక వెలుగు వెలిగిన అధికార వైసీపీ ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

ఓటరు జాబితాలో తప్పులున్నాయ్..
వారంలో సరి చేస్తా!

టీడీపీ నేత నారాయణతో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 14 : ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని వాటిని సరి చేయాలని మాజీ మంత్రి, టీడీపీ నగర ఇన్చార్జి పొంగూరు నారాయణ కలెక్టర్‌ను కోరగా, అన్నిటినీ పరిశీలించి వారంలో సరి చేస్తానని కలెక్టర్ హరినారాయణన్ ఆయనకు సమాధానం ఇచ్చారు. జాబితాలో ఓటర్ల తొలగింపు, చేర్పులు తదితర అంశాలపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇతర నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జాబితాను అందచేశారు అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ తేదీ వరకు ఓటరు జాబితాలను పరిశీలిస్తూనే ఉంటామన్న విషయాన్ని కలెక్టర్‌కు చెప్పిట్లే తెలిపారు. తప్పొప్పులను సరి చేయకపోతే ఎంత దూరమైనా వెళతామని స్పష్టం చేశారు. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తన భర్త చనిపోయిన రోజు సందర్భంగా నిరుపేదలకు ఇవ్వాలని తమ నాయకురాలు విజేత విజయవాడ నుంచి పది బ్యాటరీ ట్రైసైకిళ్లను తెప్పించారన్నారు. ఎన్నికల కోడ్ లేకపోయినా వాటిని సీజ్ చేయడం సిగ్గు చేటని అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలిపామని, గురువారం మధ్యాహ్నం లోపు వాటిని విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనిల్‌కి నెల్లూరులో పోటీ చేసే దమ్ము లేక నరసారావుపేటకు పారిపోయాడని సెటైర్లు వేశారు.

ఎన్నికల విధుల్లో అత్యుత్సాహం వద్దు

- విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్పీ



ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 14 : పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా ఎలాంటి అలసత్వం వహించకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, అత్యుత్సాహం ప్రదర్శిస్తే శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె తిరుమలేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుధవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన నెలవారి నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను వెంటనే బైండోవర్ చేయాలని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. లైసెన్స్డ్ ఆయుధాలను వెంటనే ఎస్‌హెచ్‌వోలు పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయించుకుని, ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు భద్రపరచాలన్నారు. నాన్‌బెయిల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేసి నేరస్తులను కట్టడి చేయాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యపానంపై దృష్టి పెడితే నేరాలను దాదాపు నియంత్రించవచ్చన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్ కేసులపై సమీక్షించారు. కేసుల పురోగతిలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.




నెల్లూరులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమరం

నెల్లూరు (హరనాథపు రం), ఫిబ్రవరి 14 : తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు బుధవారం ఉద్యమబాట పట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల డబ్బు చెల్లించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, క్లెయిమ్‌లు చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను 90 శాతం నగదు రూపంలో చెల్లించాలని, 11వ పీఆర్సీలో చెల్లించాల్సిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు చెల్లించాలని తదితర డిమాండ్ల కోసం నినదిస్తున్నారు. నెల్లూరులో ఏపీజేఏసీ నగర శాఖ ఆధ్వర్యంలో డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నెల్లూరు రూరల్ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ మన్నేపల్లి పెంచలరావు, జేఏసీ కన్వీనర్ నాయుడు వెంకటస్వామి, నెల్లూరు నగర శాఖ జేఏసీ చైర్మన్ చిలకా రామకృష్ణారెడ్డి, కన్వీనర్ డేగల మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

ఆత్మలకూ ఓట్లొచ్చాయ్!

- బతికి ఉన్న వారి ఓట్లు గల్లంతు
- తప్పులుతడకగా జాబితా



బతికే ఉన్న చిన్నమ్మ, వెంకటరమణయ్య ఓట్లను జాబితాలో తొలగించిన దృశ్యం

సంగం, ఫిబ్రవరి 14 : ఇటీవల విడుదలైన తుది ఓటర్ల జాబితా తప్పులు తడకగా మారింది. బతికున్నవారిని చంపేసి ఓట్లు తొలగించారు. చనిపోయిన వారి ఓట్లు మాత్రం యథావిధిగా ఉన్నాయి. సంగం మండలం వంగల్లు ఓటర్ల జాబితాయే ఇందుకు నిదర్శనం. ఈ గ్రామంలో 213, 214 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1705 మంది ఓటర్లు ఉన్నారు. జాబితాలో నెం.133లో ఎం చిన్నమ్మ, నెం.783లో గంగుల వెంకటరమణయ్యలు బతికే ఉన్నారు. కానీ ఈ ఇద్దరు చనిపోయినట్లు వారి ఓట్లు తొలగించారు. ఈ ఇద్దరు టీడీపీ సానుభూతిపరులని తెలిసింది. అలాగే, ఇక్కడే మృతులకూ ఓటు హక్కు కల్పించారు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. సుమారు 14 మంది మృతుల పేర్లు జాబితాలో ఉన్నారు. మర్థిబోయిన సుబ్బరామయ్య (316), చెట్‌పట్ రాధబాయ్మ (322), నిమ్మళ్ల సుబ్బరామయ్య (644), పడుగుపాటి బాలరాజు (648), చౌటూరు బుజ్జమ్మ (693), దాసరి బుజ్జమ్మ (739), బండారు సుబ్బమ్మ (785), పసుపులేటి రంతు (786), మోండెం వెంకటరమణయ్య (864) వీరంతా ఎప్పుడో చనిపోయారు. కానీ ఓటర్ల జాబితాలో మాత్రం వీరి పేర్లు ఉన్నాయి.

టీపీగూడూరులోనూ అంతే..



తప్పులుతడకగా సౌత్‌ఆములూరు జాబితా

తోటపల్లిగూడూరు : రాజకీయ నాయకులతో సమావేశాలు, ఇంటింటా సర్వేలు, ప్రత్యేకాధికారులతో సమీక్షలు నిర్వహించినా ఓటర్ల జాబితాలు మాత్రం మెరుగుపడలేదు. తుది జాబితాలు తప్పుల తడకలుగా మారిపోతున్నాయి. మృతుల పేర్లు, ఒకరికి రెండు ఓట్లు, ఇంటిపేర్లు, నెంబర్లు, ఫొటోలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు బీఎల్‌వోల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. టీపీగూడూరు మండలం చిన్నచెరుకూరులో పోలింగ్ కేంద్రంలో పెళ్ళి ళ్ల అయి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన 30కి మందికిపైగా పేర్లు జాబితాలో ఉన్నాయి. ఇసుకపాలెం పోలింగ్ కేంద్రంలో ఒక వ్యక్తికే రెండు ఓట్లు కల్పించారు. సౌత్‌ఆములూరులో ఓటర్ల పేర్లు చిత్రవిచిత్రంగా కనిపించాయి. ఓటరు పేరు దదద, భర్త పేరు దద జాబితాలో ప్రచురితమయ్యాయి. కొత్తపాలెం, వెంకన్నపాలెంలలో మృతులు, వలసదారుల పేర్లు నమోదయ్యాయి.



రాజరాజేశ్వరి ఆలయంలో అక్షరాభ్యాసం సందర్భంగా సరస్వతీ దేవి అలంకారం

వాగ్దేవీ నమోస్తుతే!

జిల్లా వ్యాప్తంగా అన్ని అమ్మవారి ఆలయాల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు జరిగాయి. సరస్వతీదేవికి అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. చిన్నారులు అక్షరాభ్యాసం జరిపారు. బాలబాలికలతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సరస్వతీ అమ్మవారి నామస్మరణ, శ్లోకాలతో ఆలయాలు మారుమోగాయి.

ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు రేవంత్‌రెడ్డి



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 14 : క్రికెట్‌పై ఉన్న మక్కువతో చిన్నతనం నుంచే సాధన చేసి అంచలంచెలుగా ఎదుగుతూ నేడు ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు ఎంపికయ్యాడు రేవంత్‌రెడ్డి. ఆడిన ప్రతి మ్యాచ్‌లో తన బ్యాటింగ్ ప్రతిభతో సెలక్టర్లను ఆకర్షించిన రేవంత్ అన్ని ఫార్మెట్లలో రాణించి రంజీ జట్టుకు ఎంపికవడంతో జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరులోని భక్తవత్సలనగర్‌కు చెందిన కె.రామచంద్రారెడ్డి, పుష్పలతల చిన్న కుమారుడు రేవంత్ రెడ్డి తొలిసారిగా 2011లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో చేరారు. రేవంత్‌లో క్రీడా ప్రతిభను గుర్తించిన నాటి కోచ్‌లు ప్రత్యేక శిక్షణ అందించారు. 2012లో అండర్-12, 14, 16 అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు ఫార్మెట్‌లలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో బ్యాట్స్‌మెన్‌గా, కీపర్‌గా సత్తా చాటాడు. ఈ ఏడాది జరిగిన అండర్-23 స్టేట్ ట్రోఫీలో రాణించి అనంతరం నిర్వహించిన సీకే నాయుడు అండర్-23 మ్యాచ్‌లలో రెండు డబుల్ సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలు సాధించారు. అలాగే రాష్ట్ర ప్రాబబుల్స్‌కు నిర్వహించిన వన్‌డే మ్యాచ్‌లలో 2 సెంచరీలతో అందరినీ ఆకట్టుకుని ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోచ్‌లు అందించిన శిక్షణ, ప్రోత్సాహంతోనే తాను రంజీ జట్టుకు ఎంపికయ్యానన్నారు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని తెలిపారు. కాగా, ఆంధ్ర సీనియర్ రంజీ జట్టుకు రేవంత్ ఎంపికవడం హర్షణీయమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీపీఎస్.మూర్తి, డి.నిఖిలేశ్వర్‌రెడ్డిలు తెలిపారు.

జోయాలుక్కాస్ 2వ షోరూమ్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 : నెల్లూరులోని గోమతీ నగర్ (మినీబైపాస్)లో బుధవారం సాయంత్రం జోయాలుక్కాస్ 2వ షోరూమ్ ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా సినీ నటి మిర్నా, నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కే రంగారెడ్డి హాజరై అమ్మకాలు ప్రారంభించారు. నటి మిర్నా మాట్లాడుతూ జోయాలుక్కాస్ అంటే సరికొత్త డిజైన్ల జ్యువెలరీ నిలయం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జోయాలుక్కాస్ ఆభరణాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మేయర్ స్రవంతి మాట్లాడుతూ నగరంలో 2వ శాఖను ప్రారంభించడమే కాక తక్కువ ధరలకు బంగారు నగలు విక్రయిస్తున్న షోరూమ్ అధినేత జోయాలుక్కాస్‌ను అభినందించారు. జోయలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయాలుక్కాస్ మాట్లాడుతూ తమ షోరూమ్స్‌లో ఎక్కడ కొన్నా ఆభరణాలకు బీమా, బై బ్యాక్ హామీ వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. షోరూం ప్రారంభ ఆఫరుగా మజూరీ చార్జీలపై 50 శాతం తగ్గింపును ఈనెల 25వతేదీ వరకు అందిస్తున్నామని చెప్పారు.



జోయాలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న సినీ నటి మిర్నా, మేయర్ స్రవంతి

అనుమానితుడే హంతకుడు!

- అదృశ్యమైన ఇద్దరు మహిళల దారుణ హత్య
- బంగారం కోసం దుకాణ యజమాని ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితుడు

వెంకటాచలం మండలంలో ఇద్దరు మహిళల అదృశ్యం విషాదాంతమైంది. అందరూ అనుమానించినట్లే కూరగాయల దుకాణ యజమాని గిరీష్ ఆభరణాల కోసం ఆ ఇద్దరిని పొట్టన పెట్టుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.



మృతులు జయమ్మ, రాజేశ్వరి (ఫైల్)

వెంకటాచలం, ఫిబ్రవరి 14 : చెముడుగుంట పంచాయతీ పవన్‌కాలనీకి చెందిన మేకల జయమ్మ (65), జీ రాజేశ్వరి (61)లు సోమవారం సాయంత్రం కూరగాయల దుకాణానికి వెళ్లి అదృశ్యమయ్యారు. దుకాణం నిర్వాహకుడు కందలపాడుకు చెందిన గిరీష్ కూడా అదృశ్యమవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటం, దుకాణంలో రక్తపు మరకలు ఉండటం, చెప్పులు, కళ్లజోడును పోలీసులు గుర్తించారు. మహిళల అదృశ్యం కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు గిరీష్‌గా అనుమానించారు. పోలీసుల విచారణలో గిరీష్‌కు చెందిన ఆటో ముత్తుకూరు మండలం మల్లూరు వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఆటోలోనూ రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించారు. గిరీష్ తన సెల్‌ఫోన్‌లో చివరిగా మాట్లాడిన వారి వివరాల ఆధారంగా గిరీష్‌ను విజయవాడలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బంగారం కోసమే..

తమదైన శైలిలో పోలీసులు విచారించడంతో బంగారం కోసమే ఆ ఇద్దరు మహిళలను దుకాణంలోనే కర్రతో కొట్టి చంపినట్లు తెలిసింది. వారి ఒంటిపై ఉన్న ఆభరణాలను దోచుకొని మృతదేహాలను గోనే సంచిలో కుక్కి ఆటోలో తీసుకొని నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు - దొంతాలి సమీపంలోని జామాయిల్ అడవిలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి కాల్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఆటోను మల్లూరు వద్ద వదిలి విజయవాడకు పరారైనట్లు విచారణలో వెల్లడైంది. గిరీష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం మృతదేహాలను కాల్చిన ప్రాంతానికి తీసుకెళ్లి కనుగొన్నారు. కుటుంబ సభ్యులను పిలిపించి మృతదేహాలు వారివేనని నిర్ధారించారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కూరగాయాల దుకాణం, మృతదేహాలను కాల్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్ నిపుణులను పిలిపించి దర్యాప్తు నిర్వహించారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి ఒకరి కాళ్లు మాత్రమే గుర్తించారు. అధికారుల సమక్షంలో మృతదేహాలకు అక్కడే శవపంచనామా చేయించారు. అదుపులో ఉన్న గిరీష్‌ను పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. కేసు మిస్టరీని రూరల్ డీఎస్పీ వీరాజనేయరెడ్డి, వెంకటాచలం సీఐ అంకమరావు, పోలీసు సిబ్బందితో కలిసి త్వరగా ఛేదించారు.



మృతదేహాలను కాల్చిన అటవీ ప్రాంతం

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

- పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి



కావలి (టౌన్), ఫిబ్రవరి 14 : కావలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ స్పష్టం చేశారు. 'కదిలింది కావలి' పేరిట బుధవారం సాయంత్రం కావలిలోని మినీ స్టేడియం మైదానంలో జరిగిన సభలో పసుపులేటి మాట్లాడారు. తనను ప్రధాన పార్టీలు పిలుపించుకుని టికెట్ ఇవ్వలేమని, భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తా మని అగ్రవర్ణాలకు ఊడిగం చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. బీసీగా పుట్టడం తప్పా అని ప్రశ్నించారు. జీవితాంతం బీసీలు బానిసలుగా బతకా ల్సిందేనా బానిస సంకెళ్ళు తెంపుకొని అగ్రవర్ణాలను, పార్టీలను గంగలో కలపాలని పిలుపునిచ్చారు. ఆర్థికం గా వెనుకబడిపోవడం, ఐక్యత లేకపోవడం వల్లే బీసీలు రాజ్యాధికారానికి దూరం అయిపోతున్నారని అన్నారు. ఈ సభతో రాష్ట్రవ్యాప్తంగా బీసీల్లో చైతన్యం వస్తుందని ఆశాభావం వక్తం చేశారు. తనకు పార్టీలతో సంబంధం లేదని, ప్రజల ఆకాంక్ష మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు.

నకిలీ స్టాంపులు, జామీను పత్రాల తయారీ ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరామిరెడ్డి

వెంకటగిరి, ఫిబ్రవరి 14: నకిలీ స్టాంపులు, జామీను పత్రాలు తయారు చేసే ముఠాను వెంకటగిరి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నకిలీ స్టాంపులు, వాటి తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గూడూరు డీఎస్పీ వెంకటరామిరెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన కోడివేటి రమేష్ జిల్లాలోని పలు కోర్టుల్లో బెయిలు పొందిన నిందితులకు నకిలీ జామీను పత్రాలు తయారు చేసిచ్చి అధిక మొత్తంలో డబ్బులు గుంజేవాడు. వెంకటగిరి ఎస్‌ఈబీ అధికారులు పెట్టిన ఓ గంజాయి కేసులో అరెస్టయిన కేరళ రాష్ట్రానికి చెందిన షాధీనదామస్‌కు నెల్లూరు ఏడీజే కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. జామీను పత్రాల కోసం ఇతని బంధువులు నెల్లూరులోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న రఫూర్‌ని సంప్రదించారు. అతను వెంకటాచలం మండలం చౌటపాళెం గ్రామానికి చెందిన రమేష్‌ను కలిసి గంజాయి కేసులో జామీను కావాలని చెప్పాడు. ఇందుకోసం కొంత నగదు అందజేశాడు. రమేష్ చింతలపాళెం గ్రామానికి చెందిన నలబాలు కోటేశ్వరరావు, మందా పరిశుద్ధ కలసి ఈ నెల 9వ తేదీన నిందితుడికి జామీను పత్రాలు అందజేశారు. వాటిని కోర్టులో అందజేయగా అవి పత్రాలు నకిలీ పత్రాలుగా గుర్తించిన న్యాయస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రమేష్, నలబాలు కోటేశ్వరరావు, మందా పరిశుద్ధతో పాటు నకిలీ పత్రాలు, స్టాంపులు తయారు చేసిన నెల్లూరుకు చెందిన సయాద్ అబ్దుల్, బుద్దినాదేళ్ల నరసింహులును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నకిలీ స్టాంపు పేపర్లు, వాటిని తయారు చేసే పరికరాలను స్వాధీనం చేసుకొని కోర్టుకు అప్పజెప్పారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన వెంకటగిరి సీఐ, ఎస్‌ఐలను డీఎస్పీ అభినందించారు.

బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 14: ఓ వృద్ధుడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై సంతపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆ స్టేషన్ పరిధిలో మస్తాన్ అనే వృద్ధుడు ఒంటరిగా ఉంటూ కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న చిన్నారి కుటుంబ సభ్యులు బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితునిపై కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 14: యువతి అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నెల్లూరులోని హరనాథపురానికి చెందిన యువతి ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆ యువతిని ఈ నెల 13న ఆమె అక్క ద్విచక్రవాహనంపై కళాశాల వద్ద వదిలి వెళ్లింది. ఆ తర్వాత నుంచి యువతి కనిపించడం లేదు. కళాశాలకు రాలేదని యువతి తల్లిదండ్రులకు కళాశాల సిబ్బంది ఫోన్‌చేసి చెప్పడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. జాడ తెలియకపోవడంతో బుధవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి


టైరు కింద పడి మృతిచెందిన గురవయ్య

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ శివారు ప్రాంతం బీసీ కాలనీ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేల్ పట్టణం గౌరీ శంకర్ నగర్‌కు చెందిన తుపాకుల గురవయ్య(45) బేల్దారీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామంలో జగనన్న కాలనీ నిర్మాణ పనులకు వచ్చాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కడప జిల్లా బీ.కోడూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కానుగ సుందరం, పోరుమామిళ్లకు చెందిన శెట్టి రవి, గురవయ్యలు కలిసి ట్రాక్టర్ తీసుకొని ఉదయగిరికి వచ్చారు. ఉదయగిరిలో మద్యం సేవించి తిరిగి వెంకటంపేటకు వెళుతుండగా బీసీ కాలనీలో సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న గురవయ్య కిందపడడంతో అతనిపైకి ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మద్యం మత్తులో వారు ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి వెంకటంపేటకు పనులకు వెళ్లిపోయారు. అయితే గురవయ్య ఎక్కడ.. మీరు ఇద్దరే వచ్చారని మేస్త్రీ ప్రశ్నించడంతో వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సైతం విచారించినా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ట్రాక్టర్ ప్రమాదానికి గురై గురవయ్య మృతిచెంది ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు ఇంటి నుంచి పరారైన విద్యార్థి


మేనమామకు బాలుడిని అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసు

కావలి రూరల్, ఫిబ్రవరి 14: చదువుపై ఇష్టం లేక, హాస్టల్‌కు వెళ్లలేక ఓ విద్యార్థి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైల్లో వెళ్తుండగా కావలి రైల్వే పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన రాయవరపు ప్రసాద్ కుమారుడు నాగరాజు హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. హాస్టల్ ఉంటూ చదువుకోవడం ఇష్టంలేని నాగరాజు తల్లిదండ్రులపై అలిగి ఇంట్లో నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో తిరుపతి వైపు వెళ్లే ధర్మవరం రైల్లో ఒంటరిగా ప్రయాణిస్తుండగా పోలీసులు గుర్తించి ఆరా తీశారు. విద్యార్థిని అక్కున చేర్చుకుని వివరాలు రాబట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కావలికి చేరిన విద్యార్థి మేనమామ ప్రఫుల్లా చంద్‌కు బుధవారం విద్యార్థి నాగరాజును అప్పగించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు జీఆర్పీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో టీవీ, కంప్యూటర్ దగ్ధం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోవూరు, ఫిబ్రవరి 14: స్థానిక మందబయలు కూడలిలో ఓ ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో టీవీ, కంప్యూటర్, తదితర సామగ్రి దగ్ధమయ్యాయి. వివరాల మేరకు... మందబయలు కూడలిలో ఇండియన్ బ్యాంకు మేడ మీద నివాసముంటున్న శేవల శ్రీరాములు ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువ చేసే టీవీ, కంప్యూటర్ సామగ్రి కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఏడీఎఫ్‌వో వేణుగోపాల రావు ఆధ్వర్యంలో ఘటనాస్థలికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. సకాలంలో మంటలను అదుపులోకి తీసుకురావడంతో ఆస్తి నష్టం తప్ప ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	136
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	270
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5864
వెండి కిలో ధర	రూ. 71,000
వెండి ఒక గ్రాము	రూ. 73.00

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 14: పాతకక్షల నేపథ్యంలో యువకుడిని కిడ్నాప్ చేసిన ఘటనలో సంతపేట పోలీసులు బుధవారం పలువురిని అరెస్ట్ చేశారు. సాయినందన్ అనే యువకుడిని కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేరానికి పాల్పడిన లేక్‌వ్యూకాలనీకి చెందిన వంశీకుమార్, అతని స్నేహితులైన వెంకటాచలసత్రం మండలం కనుపూరుకు చెందిన క్రాంతివర్మ, వినోద్, మనుబోలుకు చెందిన శ్రీకాంత్‌ను బుధవారం పెన్నా వంతెన సమీపంలో సంతపేట ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు అరెస్ట్ చేశారు. వారి నుంచి నేరానికి ఉపయోగించిన కారు, రెండు కత్తులు, కర్రలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ-పంట నమోదు నేటితో ముగింపు

రాయితీ విత్తనాలు, పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నా, పంటల బీమా పరిహారం దక్కాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. ఈ రబీ ప్రారంభంలోనే తుఫాను ప్రభావంతో పంటలన్నీ నాశనమయ్యాయి. ముఖ్యంగా ఉద్యాన పంటలు ఎక్కువగా దెబ్బతినగా, చేతికందిన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కొంతమేర వరి పైరు దెబ్బతింది. ఇవన్నీ ఈ-పంట నమోదు ప్రామాణికంగానే అధికారులు అంచనా వేశారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ-పంట నమోదు రబీ సీజన్‌కు సంబంధించి దాదాపు 95శాతం అధికారులు నమోదు చేశారు.

● 95శాతం పూర్తిచేసిన వ్యవసాయ శాఖ


నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెంలో ఈకేవైసీ నమోదను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 14 : రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో దాదాపు 2,93,131 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నట్లు అధికారులు లెక్కగట్టారు. బుధవారం నాటికి 2,77,564 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. ఈ-పంట నమోదుకు గురువారం ఆఖరి రోజు. దీంతో మిగిలిన 15,626 ఎకరాలు అంటే 5శాతం నమోదు చేసే ప్రక్రియలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఇప్పటివరకు 2,67,615 ఎకరాలకు వీఏఏ అథెంటికేషన్, 2,54,215 ఎకరాలకు వీఆర్వో అథెంటికేషన్ పూర్తయింది. అదే విధంగా 1,46,955 ఎకరాలకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తయింది. ఇంకా 1,46,235 ఎకరాలకు పూర్తి అవ్వాల్సి ఉందని అధికారులు చెప్పారు. జిల్లాలో ఈ-పంట నమోదు కాస్త ఆలస్యంగానే ప్రారంభమైనా ఆ శాఖ ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నా రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నట్లు డీఏవో పి.సత్యవాణి తెలిపారు.

● తగ్గిన సాగు విస్తీర్ణం

జిల్లాకు రబీ సీజన్ ఎంతో ప్రాధాన్యం. సాధారణంగా 5లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. రబీ సీజన్ ప్రారంభంలో వర్షాలు కూడా కురవడంతో రైతన్నలు పూర్తిస్థాయి విస్తీర్ణంలో సాగుకు సమాయత్తమయ్యారు. అయితే సాగునీటి విడుదల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలస్యంగా స్పందించడంతో రబీ సాగు కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. దీనికితోడు తుపాను ప్రభావం జిల్లాను కుదిపేసింది. నారుమడి నుంచి నాట్లు వేసిన తరువాత తుపాను కారణంగా పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సాగునీరు కొన్ని ప్రాంతాలకే విడుదల చేయడంతోపాటు రబీ సీజన్ అదును దాటిపోవడంతో రైతులు పంటలు వేసేందుకు ముందుకు రాలేదు. కొన్ని మండలాల్లో పంటలు సాగు చేసినా నీరు సక్రమంగా అందకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయి. సాగునీరు అందని ప్రాంతాల్లో పంటలు సాగు చేయవద్దని రైతులకు తెలిపామని, అయినా సాగులో ఉన్న ప్రతి ఎకరా ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి స్పష్టం చేశారు.

కట్టుదిట్టంగా ఇంటర్ ప్రాక్టికల్స్

● ఆర్‌ఐవో డాక్టర్ శ్రీనివాసులు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 14 : జిల్లాలో ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్‌ఐఒ) డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీఈసీ సభ్యులతోపాటు ఫ్లైయింగ్ స్క్వాడ్, ఆర్‌ఐవో, డీవీఈవో సైతం పరీక్ష కేంద్రాలను పరిశీలించి అవసరమైన చోట సెషన్ పూర్తి సమయం కేటాయిస్తున్నామని తెలిపారు. మున్ముందు జరిగే పరీక్షలు సైతం పకడ్బందీగా నిర్వహిస్తామని, నిబంధనలు అతిక్రమించినా, కాపీయింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, బుధవారం జరిగిన ప్రయోగ పరీక్షకు 110మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 3,363 మంది హాజరు కావాల్సి ఉండగా 3,306 మంది హాజరయ్యారు. 57 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం సెషన్‌లో 3,138 మంది విద్యార్థులకుగాను 3,085 మంది హాజరు కాగా 53 మంది గైర్హాజరయ్యారు.

మాయమైన అమ్మవారి కాసుల హారం స్థానంలో కొత్త బంగారు హారం అందజేత


కొత్తగా తయారు చేయించిన బంగారు కాసుల హారాన్ని చూపిస్తున్న అధికారులు

సంగం, ఫిబ్రవరి 14: మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయ కామాక్షిదేవికి ఉన్న పాత కాసుల హారం స్థానంలో కొత్త బంగారు కాసుల హారం తయారు చేయించి బుధవారం ఆలయ కమిటీకి అందచేశారు. వివరాలిలా ఉన్నాయి. పూర్వం శ్రీ కామాక్షిదేవికి దాతలు బహుకరించిన 83.3 గ్రాముల బంగారు కాసుల హారాన్ని బుచ్చిరెడ్డిపాలెంలోని కెనరా బ్యాంక్ లాకర్‌లో ఈవో పేరుతో భద్రపరుస్తారు. ఆలయ ఉత్సవాల సమయంలో తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించి తరువాత తిరిగి లాకర్‌లో భద్రపరచడం ఆనవాయితీ. ఆలయ ఈవోలు బదిలీ అయినప్పుడు కొత్తగా వచ్చిన అధికారులకు రికార్డులతోపాటు లాకర్ అప్పగిస్తారు. కాగా, కరోనా సమయంలో ఉత్సవాలు జరగకపోవడంతో కాసుల హారం బయటకు తీసుకురాలేదు. ఈనేపథ్యంలో త్వరలో జరగబోయే శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ చైర్మన్ కాసుల హారంపై ఈవోను ప్రశ్నించారు. దీంతో ఆయన తనకు చార్జ్ అప్పగించిన ఈవో కాసుల హారం అప్పగించలేదని చైర్మన్‌కు రికార్డులు చూపించారు. దీంతో ఇరువురూ వెళ్లి బ్యాంక్ లాకర్‌లో పరిశీలించగా లాకర్‌లో ఇతర బంగారు నగలు ఉన్నాయి కానీ బంగారు కాసుల హారం లేదు. జనవరి 5వ తేదీన భీమేశ్వరాలయం కామాక్షిదేవి బంగారు కాసుల హారం మాయం అనే కథనం పత్రికల్లో రావడంతో స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో రమేష్‌రెడ్డి ఈవోగా ఉన్న సమయంలో బంగారు కాసుల హారం మాయమైందని గుర్తించి ఆయనపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు నివేదకలు సిద్ధం చేశారు. దీంతో ఆయన స్పందించి తనపై చర్యలు తీసుకోవద్దు... తనే సొంత నిధులతో బంగారు కాసుల హారం తయారుచేయించి ఇస్తానని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. దీంతో వారు అనుమతి ఇవ్వడంతో ఆమేరకు ఆయన తన సొంత నిధులు రూ.5.83 లక్షలు వెచ్చించి 83.3 గ్రాముల బంగారు కాసుల హారం తయారు చేయించి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఈవో పెంచల ప్రసాద్, చైర్మన్ రఘురామయ్య సమక్షంలో ఆలయానికి అందచేశారు.

పార్టీని గెలిపించుకుంటే మంచి భవిష్యత్

● బీద, కావ్య, మాలేపాటిలతో చంద్రబాబు నాయుడు


చంద్రబాబు నాయుడిని కలిసిన బీద, కావ్య, మాలేపాటి సోదరులు

కావలి, ఫిబ్రవరి 14: టీడీపీని గెలిపించుకుంటే అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు మాలేపాటి రవీంద్ర నాయుడు, ఎమ్మెల్సీ జోన్-4 ఇన్‌చార్జి రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు చంద్రబాబు నాయుడుని కలిశారు. దీంతో కావలి టీడీపీలో సఖ్యత లేదన్న ప్రచారానికి తెరపడినట్లైంది. మాలేపాటి సోదరులు ఇప్పటి వరకు పార్టీ పరంగా తాము ఎదుర్కొన్న ఇబ్బందులు తెలిపి తమను ఇబ్బంది పెట్టిన ప్రత్యర్థులను పార్టీలో చేర్చుకుని తమ ప్రాధాన్యతను తగ్గిస్తారేమోనన్న అనుమానాలను వ్యక్తం చేశారు. దీంతో చంద్రబాబు నాయుడు పార్టీకి మొదటి నుంచి మీరు మంచి విధేయులని, మీ గుర్తింపు మీకు ఉంటుందన్నారు. ఏ పరిస్థితిలో ఇన్‌చార్జి మార్చాల్సి వచ్చిందో తెలిపి పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు కష్టపడి పనిచేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత మీకు ఇచ్చిన మాట ప్రకారం సముచిత స్థానం కల్పిస్తామని మాలేపాటి సోదరులకు చంద్రబాబు భరోసా ఇచ్చారు. దీంతో మాలేపాటి సోదరులు కూడా కావలిలో కావ్యను మంచి మెజార్టీతో గెలిపించుకుని వచ్చే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

చౌదరిపాలెంలో విషజ్వరాలు!

● మంచం పడుతున్న ప్రజలు ● లోపించిన పారిశుధ్యం

● దోమల బెడదతో బెంబేలు ● పట్టించుకునే వారు కరువు

కావలి రూరల్, ఫిబ్రవరి 14: కావలి మండలం చౌదరిపాలెంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం లోపించడంతో దోమలు ఉత్పత్తి చెంది రేయింబవళ్లు తేడా లేకుండా ప్రజలపై దాడి చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తోన్నాయి. దీంతో విషజ్వరాలు ప్రబలి చిన్నా పెద్ద తేడా లేకుండా గ్రామస్థులు మంచం పడుతున్నారు. అయినా ఈ గ్రామాన్ని పట్టించుకునేవారే కరువయ్యారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న చౌదరిపాలెంను రాష్ట్రంలో వైసీపీ అధికారం చేపట్టిన తరువాత విభజించు పాలించు అన్న చందంగా ముక్కలు చేసి 650 ఓట్లు ఉన్న గ్రామంలోని 180 కుటుంబాలను 6 వార్డుల్లోకి విలీనం చేసి పంచాయతీ నుంచి మున్సిపాలిటీలో కలిపే ప్రయత్నం చేశారు. దీనికి గ్రామస్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో గ్రామాన్ని రెండుగా విభజించి ముసునూరు ఇందిరమ్మకాలనీలో కొన్ని, బుడంగుంట కాలనీలో కొన్ని కుటుంబాలను చేర్చారు. తమ ప్రయత్నాన్ని అడ్డుకున్న గ్రామస్థులపై ఆగ్రహించిన పాలకులు పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో గ్రామం దోమలకు నిలయంగా మారింది. దీంతో తరచూ గ్రామస్థులు విషజ్వరాల బారిన పడుతున్నా అటు అధికారులు గాని ఇటు పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల గ్రామానికి చెందిన అడుసుమల్లి సుజాత, మండవ రమ, రాపూరి సంపూర్ణ, రావిపాటి శేషమ్మ, యామన రవికుమార్, ముప్పర అనిల్, కాకర్ల శృజన, కరివేటి క్రిష్ణ, తదితరులు జ్వరాలతో మంచం పట్టారు. ఒంటిపై గుల్లలు రావడం, కణాలు తగ్గి నీరశించిపోవడం వంటి లక్షణాలతో వీరంతా కావలి, నెల్లూరు, ఒంగోలులోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది వేల రూపాయలు ఖర్చు చేశారు. గ్రామంలో ప్రజలు వరుసగా విషజ్వరాల బారిన పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జ్వరంతో మంచం పట్టిన మండవ రమ, కరివేటి సుబ్బమ్మ

ఏఆర్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 14: ఏఆర్ డీఎస్పీగా పీ వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌టీఆర్ జిల్లా ఏటూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు 1992లో పోలీసుశాఖలో ఆర్‌ఎస్‌ఐగా చేరారు. విజయవాడ, జీఆర్పీ, మచిలీపట్నం, ఆక్టోపస్‌తో పాటు పలు విభాగాల్లో పనిచేశారు. ఒంగోలు ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

వర్సిటీ సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు పొడిగింపు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 14 : విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పెంపు అంశాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, దీనికి స్పందిస్తూ ఉత్తర్వులివ్వడం అభినందనీయమంటూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

18న వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 14 : జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా జట్ల ఎంపిక నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 18వతేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎన్ ప్రభాకర్‌రెడ్డి, పీ థామస్ పీటర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడలో ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సదస్సు, క్రీడాపోటీలు జరుగుతాయని తెలిపారు. వాటిలో పాల్గొనేందుకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులకు ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. పురుషులకు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, హాకీ, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు, మహిళలకు త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, పరుగు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన పీఈటీలందరూ ఉదయం 9 గంటలకు హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 14 : ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని డ్రైవర్స్‌కాలనీలో ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్ ఎస్ సుబ్రహ్మణ్యం(75), సుశీలమ్మ దంపతులు నివసిస్తున్నారు. ఆయన కొడవలూరులోని ఓ ప్రైవేటు కళాశాలకు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధాప్య కారణాలతో నాలుగు నెలలుగా పనిమానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం కుదుట పడలేదు. ఈ నేపథ్యంలో మనస్తాపంతో ఈ నెల 7వ తేదీ ఆత్మహత్య చేసుకునేందుకు గడ్డిమందు తాగాడు. స్నేహితుడు పాపయ్యకు విషయం చెప్పడంతో ఆయన హుటాహుటిన ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న సుబ్రహ్మణ్యంను జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సుబ్రహ్మణ్యం భార్య సుశీలమ్మ ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మీద అలిగి ఆత్మహత్య

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 : మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదన్న కారణంతో భార్య పై అలిగి ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు.. రూరల్ మండలం ములుముడి గ్రామానికి చెందిన పిట్ట చెంచురామయ్య (51) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని భార్య సుబ్బమ్మను డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఆదివారం గుళికల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

17న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 14 : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నెల్లూరులోని టౌన్‌హాల్లో ఈనెల 17న సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నామని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెన్షన్ల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 14 : సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నేత పెంచల నరసయ్య మాట్లాడుతూ 16 రోజులు కార్మికులు సమ్మె చేశారని తెలిపారు. ఇందులో పలు అంశాలను ప్రభుత్వం ఒప్పుకుని ఆ మేరకు ప్రయోజనం కలగచేయాలని తీర్మానించిందన్నారు. దానికి సంబంధించిన జీవో ఇప్పటి వరకు విడుదల చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అశోక్, దేశమూర్తి, సునీల్, లోకేష్, శ్రీను పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పునాదులు దాటని జగనన్న ఇళ్లు

● నత్తనడకన నిర్మాణాలు ● 40 శాతం కూడా పూర్తికాని వైనం



మంచాలపల్లిలో పునాది దశలో ఉన్న గృహాలు

అనంతసాగరం, ఫిబ్రవరి 14: పేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఎక్కడా పూర్తయిన గృహాలు కనిపించక పోగా.. అసంపూర్తి నిర్మాణాలు మాత్రం ప్రతిగ్రామంలో దర్శనమిస్తున్నాయి. అనంతసాగరం మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 22 లేఅవుట్లు వేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి గృహాలు కట్టుకునేందుకు అవకాశం కల్పించారు. మండలంలో మొత్తం 1200 గృహాలు మంజూరు కాగా ఇంతవరకు 40 శాతం కూడా ఇళ్లు పూర్తికాలేదు. ఇంకా చాలా చోట్ల జగనన్న గృహాలు నిర్మాణ దశలో ఉండడం గమనార్హం.

పలు కారణాలతో ఆగిన నిర్మాణాలు

ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తుంది. చాలాచోట్ల ఇళ్ల నిర్మాణాలు పలు కారణాలతో నిలిచిపోయాయి. సోమశిలలో 100, మంచాలపల్లిలో 20 ఇళ్ల నిర్మాణాల బాధ్యత ఓ గుత్తేదారుకు అప్పగించగా రెండు చోట్లా కొన్ని నిర్మాణాలు పునాది దశ కూడా దాటలేదు. త్వరగా పనులు చేసేలా అధికారుల చర్యలు లేవని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అనంతసాగరంలో నాలుగు లేఅవుట్లు వేసి 300 గృహాలు మంజూరు చేయగా ఇంతవరకు పనులు ముగించుకొని ఇళ్లలోకి వెళ్లిన వారి సంఖ్య 15లోపే. ఇక అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, ఇటుక, ఐరన్, కంకర, ఇసుక, బేల్దారు మేస్త్రీల ఖర్చులు పెరగడంతో పాటు కొన్నిచోట్ల సదుపాయాలు లేక లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఇదిలా ఉంటే త్వరలో సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయి. వచ్చే బిల్లులకు ఇబ్బందికర పరిస్థితి ఉంటుందేమోనని ఇళ్ల నిర్మాణదారులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, ఇళ్ల పురోగతిపై అనంతసాగరం హౌసింగ్ ఏఈ శరత్‌ను వివరణ కోరగా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా దృష్టిసారించామని, ఎప్పటికప్పుడు బిల్లులు పెడుతున్నాం.. బిల్లు మంజూరులో జాప్యం లేదని తెలిపారు.

వెంకయ్యనాయుడుకు ప్రవాసాంధ్రుల అభినందనలు



వెంకయ్యను సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 14: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును బుధవారం నియోజకవర్గ బీజేపీ నాయకుడు, కర్నాటక ఫిలిం సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు గంగవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో బెంగళూరులో స్థిరపడిన ఉదయగిరి ప్రాంత వాసులు రాజ్‌భవన్‌లో కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మవిభూషణ్ బిరుదుతో సత్కరించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కూనల వెంకటేశ్వరరావు, మద్దినేని మోహనరావు, ఇడుమకంటి లక్ష్మిరెడ్డి, రెడ్లదిన్నె కేశవరావు, కురుగొండ్ల దామోదర్, కరణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న ఎంవీఐ రాములు, సిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: స్థానిక మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంవీఐ రాములు, సిబ్బంది, వాహనదారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అన్నప్రసాద భవనానికి విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

కందుకూరు, ఫిబ్రవరి 14: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి దివి రవిశేఖర్, రమణమ్మ దంపతులు బుధవారం రూ. 1,00,116లు విరాళంగా అందజేశారు. తమ కుమారుడు దివి ప్రణీత్ చౌదరి జ్ఞాపకార్థం ఈ నగదు అయ్యప్పసేవా సంఘం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సేవాసంఘం సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

పసుపులేటి సభకు తరలిన అభిమానులు



సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

అల్లూరు, ఫిబ్రవరి 14 : పీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ పసుపులేటి సుధాకర్ బుధవారం కావలిలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు అల్లూరుకు చెందిన ఎల్లు సాల్మన్ రాజు ఆధ్వర్యంలో అభిమానులు భారీగా తరలివెళ్లారు. సుమారు 100 ఆటోల్లో ప్రజలు తరలి వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

బీజేపీ నేత మృతికి పలువురి సంతాపం



జనార్ధన్‌రావు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

బిట్రగుంట, ఫిబ్రవరి 14: బోగోలు పంచాయతీ అక్కరాజువారికండ్రిగకు చెందిన బీజేపీ నేత బొద్దులూరి జనార్ధన్‌రావు మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం ఆయన పార్థీవ దేహాన్ని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్, కావలి టౌన్ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, నియోజకవర్గ ఇంచార్జి సీవీసీ సత్యం, మాజీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, మస్తానయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్.సురేష్‌బాబులు నివాళులర్పించారు.

గృహ నిర్మాణ సిమెంట్‌పై ఈఈ విచారణ



విచారణ చేస్తున్న ఈఈ దయాకర్

సంగం, ఫిబ్రవరి 14: స్థానిక గృహ నిర్మాణ శాఖకు మంజూరైన సిమెంట్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండా సీఆర్‌వో (సిమెంట్ రిలీజ్ ఆర్డర్)లు తీయడంపై గృహ నిర్మాణ శాఖ ఈఈ దయాకర్ బుధవారం విచారణ జరిపారు. తమ ఐడీ లాగిన్‌ల నుంచి లబ్ధిదారుల పేరుతో ఏఈ కరీముల్లా సీఆర్‌వోలు తీశారని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈఈ దయాకర్ డీఈ ముక్తహార్ సమక్షంలో ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను విచారించారు. సీఆర్‌వోలు తీసి సిమెంట్ పంపిణీ చేయని జాబితాను లబ్ధిదారుల వారీగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పూర్తి సమాచారంతో లిఖిత పూర్వకంగా అందచేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ సీఆర్‌వోలు తీసి సిమెంట్ పంపిణీ చేయని లబ్ధిదారులందరికీ సిమెంట్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ కరీముల్లా, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కావలి, ఫిబ్రవరి 14: జన విజ్ఞాన వేదిక కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతోన్న సైన్స్‌డే వారోత్సవాల్లో భాగంగా బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్లకు మా ఇంటి పెరటితోట, సీనియర్లకు మాబడి పర్యావరణహితం అనే అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చక్కని చిత్రాలు వేశారు. 25 స్కూళ్ల నుంచి 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక బాధ్యులు జానకిరాం, హరినాథ్, సుబ్బరాయశర్మ, సీ.శారద, ఖాదర్‌బాషా, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం మధ్యాహ్నం రెడ్‌క్రాస్ భవనంలో జానపద, శాస్త్రీయ నృత్య పోటీలు జరుగుతాయని జేవీవీ బాధ్యులు తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను ఈ పోటీలకు పంపాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవల నోడల్ అధికారి దయాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీల్లో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీర్ఘకాలిక రోగులు, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారి ఇంటికెళ్లి వైద్యసేవలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఏఎన్ఎంలు యాప్‌ల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగుసూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, వినీత, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, సీహెచ్‌వో శివకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి భారత్ బంద్‌ను జయప్రదం చేయండి



కావలి: మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

కావలి, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు ఈనెల 16న జరిగే భారత్ బంద్, గ్రామీణ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. కావలి సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సీపీఎం నేత పసుపులేటి పెంచలయ్య, సీపీఐ నేత కే.నరసింహారావు, సీపీఐ(ఎంఎల్) నాయకుడు ఎల్ లక్ష్మీరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కరువది భాస్కర్, స్త్రీ విముక్త సంఘటన నాయకురాలు శ్యామల తదితరులు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఇబ్బందికరమైన నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

సీతారామపురం : స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కి బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన సాగుచట్టానికి వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన గ్రామీణ భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్ కార్యక్రమంలో రైతులు, ప్రజలు, కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వాధీనం చేసుకున్న భూమి నిరుపేదలకు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వింజమూరు, ఫిబ్రవరి 14 : పట్టణంలోని సర్వే నెంబరు 131, 132లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని నిరుపేదలకు ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచెర్ల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సదరు భూములను పూర్వం నుంచి ఉన్న దారులను సర్వే చేసి రైతులకు పక్కాగా ఇవ్వాలని తహసీల్దారును మండల బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఉదయగిరి బీజేపీ ఇన్‌చార్జ్ కదిరి వెంకటరంగారావు, మండల కన్వీనర్ డేగా మధుయాదవ్, వీహెచ్‌పీ కావలి జిల్లా అధ్యక్షుడు ఎంబీ శేషారెడ్డి, వె .వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, మెంటా రమేష్, వెంకయ్య, పోలిశెట్టి సత్యనారాయణ, జిల్లెల్ల శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కోటాయపల్లి విద్యార్థి ప్రతిభ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని కోటాయపల్లి గ్రామానికి చెందిన దుద్దుకూరి మోహన్ మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 93.20 పర్సంటైల్ సాధించి తన ప్రతిభ చాటాడు. అడ్వాన్స్‌డ్‌లోనూ ఉత్తమ ర్యాంకు సాధిస్తానని మోహన్ ధీమా వ్యక్తం చేశాడు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: జిల్లాస్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉదయగిరి బీసీ కాలనీ ఎంపీయూపీఎస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ఎస్ అరాఫత్ ఆధ్వర్యంలో షేక్ సుఫియాన్ తయారుచేసిన స్మార్ట్ కార్ పార్కింగ్ కిడ్స్ సేఫ్టీ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈనెల 18న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. అలాగే ఉమెన్ సేఫ్టీ విత్ యూజింగ్ జీపీఎస్ అండ్ జీఎస్ఎం ప్రదర్శన జిల్లాస్థాయికి ఎంపికైందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతోపాటు సైన్స్ ఉపాధ్యాయుడిని అభినందించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సోమశిలలో 21.581 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఫిబ్రవరి 14: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి జలాశయంలో 21.581 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వైసీపీ రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయ్ : పొన్నెబోయిన



ఉదయగిరి రూరల్: విలేఖరులతో మాట్లాడుతున్న చెంచలబాబు



లింగసముద్రం : మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, త్వరలో ఆ పార్టీకి ప్రజలు చరమగీతం పాడనున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పేరుతో పేదలను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో అన్నిరకాల ధరలు పెరిగిపోవడంతో సామాన్యుని జీవనం భారమైందన్నారు. హైదరాబాదు రాజధానిగా ఉండాలని వైవీ సుబ్బారెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దామా అని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో 160 అసెంబ్లీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు మాబాషా, సురేష్, రాజా, బాలఅంకయ్య, మస్తాన్, రామ్మోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు సమాయత్తంకండి : ఇంటూరి

లింగసముద్రం : రాబోయే ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అన్నెబోయినపల్లిలో 'మన గ్రామానికి - మన ఇంటూరి' ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పార్టీ సీనియర్ నాయకుల సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం పలు విషయాలపై తెలుగు తమ్ముళ్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కామినేని ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు



ముస్తాబైన ఆలయం

వరికుంటపాడు, ఫిబ్రవరి 14: స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన పద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ బింబప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తొలిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవేశబలి, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన నిర్వహించడం జరుగుతుందన్నారు. 16న సహస్రనామ పారాయణం, క్షీరాధివాసము, నివేదన, 17న ప్రత్యేక పూజలు, జలాధివాసము, 18న కలశస్థాపన, అష్టబంధ సమర్పణం, బింబస్థాపన, 19న ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విశ్వరూప దర్శనం, కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

డీబీఎస్ కళాశాలలో రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న యాజమాన్యం

కావలిటౌన్, ఫిబ్రవరి 14: డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ టీవీ రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కళాశాల కార్యదర్శి దామిశెట్టి బలసురేష్‌బాబు, కరస్పాండెంట్ సుధీర్ నాయుడు ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణం ప్రారంభం

అనంతసాగరం, ఫిబ్రవరి 14: మండలంలోని అనంతసాగరంను నెంబర్1 స్థానంలో నెలబెడతానని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన విజయీభవ యాత్ర కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా దివంగత మాజీ జెడ్పీటీసీ బుట్టి వెంటకృష్ణారెడ్డి పేరిట వారి కుంటుబ సభ్యులు నిర్మించిన బస్టాండ్ ప్రాంగణంను ప్రారంభించారు. అలాగే నూతన పశువైద్యశాల, సచివాలయం 2, అతిథి గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, అంకిరెడ్డి, ఎద్దుల శ్రీనివాసలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

చేజర్ల: మండలంలోని ఏటూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఉట్లపల్లి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను బుధవారం ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకుడు రఘురామిరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ వీర్ల పార్థసారధి, నాయకులు సుధాకరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గురువారం మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మేకపాటి పలు అభివృద్ధి పథకాలు ప్రారంభించనున్నట్లు, ఎమ్మెల్యే కార్యాలయపు సిబ్బంది తెలిపారు.

5 నెలలుగా అందని రేషన్ సరుకులు

బిట్రగుంట, ఫిబ్రవరి 14: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామానికి 5 నెలలుగా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామంలోని 8వ నెంబరు షాపులో 240కి పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి సరుకులు అందడం లేదన్న విషయమై ఎండీయూ ఆపరేటర్‌ను ప్రశ్నించగా రేషన్ షాపు డీలర్ స్టాక్ సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయ్‌ని వివరణ కోరగా గురువారం నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలోని అన్నపూర్ణ కాంప్లెక్సులో బుధవారం జడ్పీటీసీ మోడి రామాంజనేయులయాదవ్, మండల వైసీపీ కన్వీనర్ గానుగపెంట ఓబులరెడ్డిలు వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, నాయకులు కె.నరసింహారెడ్డి, నారపరెడ్డి, దర్వేష్, దారపనేని చెన్నయ్య, ఉప్పుటూరి హరి పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులకు తీవ్రనష్టం

● ఉద్యోగ జేఏసీ చైర్మన్ శివకుమార్



కావలిటౌన్: నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

కావలిటౌన్, ఫిబ్రవరి 14: నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఉద్యోగ జేఏసీ చైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుతో బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద డివిజన్ జేఏసీ నేతల నిరసన కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ 11వ పీఆర్సీ ఉద్యోగులను నిరాశకు గురి చేసిందని 12వ పీఆర్సీపై ప్రభుత్వపై జేఏసీ ఒత్తిడి తేవడంతో 12 పీఆర్సీపై కమిటీ ఏర్పాటు చేసి 8నెలలు గడుస్తున్నప్పటికీ అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి ఉద్యోగులు విసిగి వేసారిపోయారని ఉద్యమ బాట తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రావు, ఫ్యాప్టో మధు, దీక్షుతులు, బ్రహ్మయ్య, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏపీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కందుకూరులో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత జూలై 1 నుంచి 12వ పీఆర్సీ అమలుకావాల్సి ఉండగా నేటికీ పీఆర్సీ కమిషన్ నివేదిక కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లాంటి ఫండ్‌ల ద్వారా రుణాలకు ప్రయత్నించినా దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నాయకులు జీవీవీ ప్రసాదరావు, బాలరాజు, సుజాత, రజిత, ఉపాధ్యాయసంఘాల నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మునీర్‌బాషా, అశోక్, పెన్షనర్లసంఘం నాయకులు నరసింహం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసేవారికే మద్దతు : యూటీఎఫ్



పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

అనంతసాగరం, ఫిబ్రవరి 14: ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతసాగరంలో యూటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు పోస్టుకార్డు రాసి.. ఈసారి ఉద్యోగులు మోసపోవడానికి సిద్ధంగా లేరని, ఏపార్టీ అయితే మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలుచేస్తామని ప్రకటిస్తారో ఆపార్టీకి మద్దతిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి, సభ్యులు వెంకటసుబ్బయ్య, పాపిశెట్టి నరసింహులు, తిరుపాలు, గౌస్‌బాష, శైలజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎస్ఐకి అవార్డు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డికి జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి బుధవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఉదయగిరి కోర్టు కానిస్టేబుల్ సుబ్బయ్య విధి నిర్వహణలో ప్రతిభ చూపడంతో ఎస్పీ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ వేల్పుల గిరిబాబుతోపాటు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

ఉదయగిరిలో రచ్చబండ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: ఉదయగిరి పట్టణంలో బుధవారం రచ్చబండ కార్యక్రమాన్ని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిర్వహించారు. తొలుత దర్గాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరానగర్‌కాలనీ, సినిమాహాలువీధి, ఎస్సీ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకుడు అభినయ్‌రెడ్డి, జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ జీ.ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, అక్కి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రారంభం

సీతారామపురం : ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి బుధవారం మండలంలోని పబ్బులేటిపల్లి, అయ్యవారిపల్లి, బాలాయపల్లిలోని నూతన సచివాలయాలను ప్రారంభించారు. అనంతరం పబ్బులేటిపల్లి సచివాలయ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణరెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, సీతారామపురం ఎంపీటీసి పాలగిరి అల్లూరురాజు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దోమలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

● వ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు



ఖాళీ స్థలంలో చేరిన మురికి నీరు

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 : మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీపంలో తదితర ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వీటి యజమానుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికి తోడు ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో పరిసర ప్రాంత ప్రజల మురికినీరు అందులోకి వదులుతుండడంతో మురికికూపాలుగా మారుతున్నాయి. గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఖాళీ స్థలాల్లో తాగేసిన కొబ్బరిబొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామాగ్రి, పాత టైర్లు వంటివన్నీ పడేశారు. వర్షం పడగానే వాటిలో నీళ్లు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమలు పెరుగుతున్నాయి. ఈ ఖాళీస్థలాల చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలో డెంగీ, మలేరియా, టైఫస్ వంటి జ్వరాల బారినపడిన బాధితులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని వ్యాధుల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా వసంత పంచమి

భక్తిశ్రద్ధలతో సరస్వతీపూజ
చిన్నారులతో అక్షరాభ్యాసం

పొదలకూరు, ఫిబ్రవరి 14 : పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. అమరావతి, విజేత, గాయత్రి పాఠశాలల్లో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె సురేష్ సతీమణి మంజుల పండితుల సమక్షంలో పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులకు పలకలను, సరస్వతీదేవి నమూనా మెమొంటోలను ఉచితంగా అందేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** పట్టణంలోని గోపాలకృష్ణయ్య స్కూల్‌తోపాటు పలు పాఠశాలల్లో బుధవారం 32మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతి పూజ చేసి చిన్నారులచే పలకలమీద బీజాక్షరాలు రాయించి ఆశీర్వచనాలు అందించారు. విద్యార్థులందరికీ దాత దొడ్ల కోదండరామిరెడ్డి సహకారంతో పెన్సిల్ బాక్సులు, విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎన్.శ్రీధర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

● **వెంకటాచలం :** స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ఉన్న స్వర్ణభారతి విద్యా మందిర్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సులోచన తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : వసంత పంచమి వేడుకల్లో ఉపాధ్యాయినులు

మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దమ్ము కొండలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి సస్పెన్షన్

విడవలూరు, ఫిబ్రవరి 14: వైసీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డిని పార్టీ నుంచి తొలగిస్తూ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నడుపుతూ, క్రమశిక్షణకు భంగం కలిగిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తున్నారని, అందువలన ఆయనను పార్టీని నుంచి తొలగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. కాగా పార్టీ నుంచి బెజవాడ గోవర్ధన్‌రెడ్డిని సస్పెన్షన్ చేయడంపట్ల ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 10 ఏళ్లగా పార్టీ మండలాధ్యక్షుడిగా సేవలందిస్తున్న ఆయనను పార్టీ నుంచి అకారణంగా తొలగించటం సరికాదన్నారు. ఆయనను తిరిగి పార్టీలోనికి తీసుకోకపోతే తామంతా పార్టీ వీడుతామని వారు హెచ్చరించారు.

కంకినల్లి తెగులును నివారించాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14: ఒక మిల్లీలీటరు స్పైరోమెసిఫెన్‌ను లీటర్ నీటిలో కలిపి వరి పంటపై పిచికారీ చేస్తే వరిలో కంకినల్లి తెగులను నివారిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని మునులపూడిలో వరి పొలాలను పరిశీలించి కంకినల్లిని గుర్తించారు. అదే విధంగా బ్యాక్టీరియా కంకి ఎండు తెగులును గమనించి దాని నివారణకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్ (ఎఫ్‌టీసీ) డీడీఏ శివన్నారాయణ, ఎఫ్‌టీసీ ఏఓలు శైలజాకుమారి, వాసు, మండల వ్యవసాయాధికారి పి.సురేంద్రరెడ్డి, ఏఈవో ఆసిమా, సోమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

కొడవలూరు, ఫిబ్రవరి 14 : మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అలా నడిపితే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ వీరప్రతాప్ హెచ్చరించారు. మండలంలోని నార్తు రాజుపాళెంలో బుధవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో గస్తీ పెంచామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి

కోవూరు, ఫిబ్రవరి 14: వాహన డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారిణి కే.వాణి కోరారు. స్థానిక లారీ యార్డులో బుధవారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. రహదారి భద్రత పెంపొందించుకోవాలన్నారు. డ్రైవర్లు సురక్షితమైన బాధ్యతాయుతమైన వ్యక్తులుగా వ్యవహరించాలన్నారు. న్యాయవిజ్ఞాన సదస్సులో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్, కొండస్వామినాయుడు, దామోదర్‌రెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు రఘువర్ధన్, తదితరులు మాట్లాడారు.

పేదలకు అన్నదానం

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 14 : వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మనవరాలు కొండేపాటి యామని జన్మదినం సందర్భంగా బుధవారం రాపూరు, వెంకటగిరిలో పేదలకు అన్నదానం చేశారు. కొండేపాటి యామని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌కు మనవరాలు కావడంతో ఆమె జన్మదిన వేడుకలు చెన్నైలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేతలు తెలిపారు.

బూరాన్‌పూర్‌లో ఎన్ఎస్ఎస్ క్యాంప్

వెంకటాచలం, ఫిబ్రవరి 14 : మండలంలోని చెముడుగుంట పంచాయతీ బూరాన్‌పూర్ గ్రామంలో జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. గ్రామంలోని డ్రైనేజి, చెత్త, ముళ్ల కంప, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దొర్నాదుల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు జాకీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెంచురామారావు, ఉపాధ్యాయుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన

కోవూరు, ఫిబ్రవరి 14: పింఛనుదార్లకు, ఉద్యోగులకు మధ్యంతర భృతి కల్పించాలని కోరుతూ ఉద్యోగ సంఘాల నాయకులు బుధవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తాలూకా యూనిట్ అధ్యక్షుడు దిలీప్, కార్యదర్శి కోటేష్, ఎన్జీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● **పొదలకూరు:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దారు శివకృష్ణకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పొదలకూరు తాలూకా ఎన్జీవో అధ్యక్షుడు కప శ్రీనివాసులు, కార్యదర్శి రంజీవి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను, డీఏలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జేఏసీ పొదలకూరు తాలూకా కోశాధికారి కే కామాక్షమ్మ, ఉపాధ్యక్షులు ఎస్‌కే షాన్వాజ్, ఏ శ్రీహరి, సంయుక్త కార్యదర్శి కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేరుకే నగర పంచాయతీ!

● ప్రతి అడుగు ప్రజల కోసంలో దినేష్‌రెడ్డి



13వ వార్డులో పర్యటిస్తున్న దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14: బుచ్చిరెడ్డిపాళెం పేరుకే నగర పంచాయతీ అని, ఏ వీధికెళ్లినా, ఏ ఇంటికెళ్లినా ప్రజలు అధ్వాన పారిశుధ్యం, దోమలతో భయాందోళన చెందుతున్నారని టీడీపీ కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. బుధవారం 13వ వార్డు ఇన్‌చార్జి నెల్లూరు దయాకర్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి ఆ వార్డులో ప్రతి అడుగు ప్రజలకోసం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వీధిలో ప్రజల సమస్యల ను తెలుసుకుంటూ టీడీపీ ప్రవేశపెట్టిన భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. బుచ్చిలో మార్చురీ దుస్థితిలో ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో ప్రతి సమస్య పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు. కాగా, బుచ్చి నగర పంచాయతీ 13వ వార్డుకు చెందిన సోము రామచంద్రారెడ్డి, అనిత, మోపూరు ఎల్లారెడ్డి, కుటుంబ సభ్యులు, వారి అనుచరులు ఆ వార్డు నాయకులు నెల్లూరు దయాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి అధ్వర్యంలో దినేష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : టీడీపీ

కొడవలూరు, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో నాలుగేళ్లుగా రాక్షస పాలన రాజ్యమేలుతుందని, ఈ పాలనలో అన్యాయాలు, అక్రమా లు అడిగిన వారిపై అక్రమ కేసు లు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని టీడీపీ సినియర్ నాయకుడు పల్లంరెడ్డి సు రేష్ రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో బుధవారం జరిగిన గ్రామస్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగ ట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొండూరు చంద్ర, లోకేష్, దినేష్, వేణు, శ్రీనివాసులు, పల్లంరెడ్డి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు కంప్యూటర్ కోర్సులో శిక్షణ

నెల్లూరు (విద్య) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతి, యువకులకు కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్ కోర్సులో ఉచితంగా మూడు నెలల శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9494456326, 9704510793 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రాయలసీమకు రాజధాని కావాలి : చింతా



రాపూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చింతా ప్రదర్శన

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 14 : రాయలసీమలో రాళ్లు కాదు... రాజధాని కావాలనే నినాదంతో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాపూరులో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాతబస్టాండు కూడలిలో మీడియాతో మాట్లాడారు. కోనసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో గోదావరి జలాలు, గుంటూరు, కృష్ణా ప్రాంతాల్లో కృష్ణాజలాలు ఉన్నాయని, రాయలసీమలో పేద రైతులకు రాళ్లు తప్ప మరేమీ లేవన్నారు. ఈ సమయంలో అందరూ రాయలసీమను రాజధాని నగరం చేయమని అడుగుతున్నారన్నారు. రాపూరు నుంచి ఏర్పేడు వరకు లక్ష ఎకరాల ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయని, ఈ భూముల్లో రాజధాని కట్టుకోవచ్చన్నారు. పక్కనే కండలేరులో డ్యాంలో నీరు పుష్కలంగా ఉండటం అనుకూలిస్తుందన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రాంతం తిరుపతిని రాజధాని నగరం చేసి ప్రపంచంలోనే గొప్ప నగరంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి రాజధాని అవుతుంది

పొదలకూరు, ఫిబ్రవరి 14 : తిరుపతి రాజధాని అవుతుందని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ జోస్యం చెప్పారు. పొదలకూరు పట్టణంలో బుధవారం రాళ్లు కాదు - రాజధాని కావాలి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా షర్మిలా రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాయకులు పూలచంద్రశేఖర్, మండల అధ్యక్షుడు విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 14 : పట్టణంలోని ఖాజానగర్, శాంతినగర్‌లో దుర్గంధం వెదజల్లుతున్న గుడపల్లి కాలువను నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు పరిశీలించారు. 7వవార్డు కౌన్సిలర్ షకీలాబేగం భర్త అల్లాభక్షు కాలువలో పూడిక తీయించాలని కోరడంతో కమిషనర్ కాలువను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, కమిషనర్‌ను స్థానికులు శాలువాతో సత్కరించారు.

నకిలీ తత్వం కాకాణి జీవితం : సోమిరెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 14 : ఫేక్ ప్రచారాలు, నకిలీ పత్రాలు, మద్యం, ఫోటోలు మార్ఫింగ్ వంటి నకిలీ తత్వానికే మంత్రి కాకాణి జీవితం అంకితం చేశాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. మండలంలోని తిక్కవరప్పాడు, గొట్లపాళెం గ్రామాల్లో బుధవారం సాయంత్రం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో సోమిరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కృష్ణపట్నం పోర్టుకు కంటైనర్ టెర్మినల్ వచ్చేసినట్లు కొత్తగా కాకాణి ఫేక్ ప్రచారానికి తెరతీశాడన్నారు. కార్యక్రమంలో రాజాయాదవ్, నాగార్జున్‌రెడ్డి, రమేష్‌నాయుడు, రామానాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, మురళీ, సుధాకర్, సురేష్‌నాయుడు, శ్రీహరి, రమేష్, మునెయ్య, మణి, శ్రీను, సతీష్, సుమంత్ తదితరులున్నారు. కాగా, నెల్లూరులోని సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో బుధవారం పూడిపర్తికి చెందిన 12 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు : కాకాణి

ముత్తుకూరు, ఫిబ్రవరి 14 : మండలంలోని పంటపాలెంలో నూతనంగా నిర్మించిన అనాఎడిబుల్ ఆయిల్ పరిశ్రమను వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పేదవారైన స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పరిశ్రమల యాజమాన్యానికి సూచించారు. అనంతరం దొరువులపాలెంలో గోకుల్ ఆగ్రో ఇండస్ట్రీస్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కృష్ణపట్నం పోర్టు టెర్మినల్ తరలిపోతుందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నారని, పోర్టు టర్మినల్ తరలిపోదనేందుకు నిదర్శనంగా ఫిబ్రవరి 16వ తేదీన కృష్ణపట్నానికి కంటైనర్ నౌక రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ఇండస్ట్రీస్ జీఎం సుధాకర్, సన్నారెడ్డి పెంచలరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, తేజరెడ్డి పాల్గొన్నారు.

చెన్నకేశవ ఆలయానికి భూమి పూజ

తోటపల్లిగూడూరు : మండలంలోని పేడూరు గ్రామంలో బుధవారం శ్రీచెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయం నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

అష్టలక్ష్మీ ఆలయంలో నేటి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

● అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద భారతి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 : నగరంలో సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో గురు, శుక్రవారాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద స్వామీజీ బుధవారం రాత్రి నగరానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. గురువారం ఉదయం 10గంటలకు స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీసూక్త యాగం, చక్రార్చన జరుగుతాయి. శుక్రవారం ఉదయం 6గంటలకు రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజ, ఆదిత్య హృదయం పారాయణం జరుగుతాయి. అనంతరం చక్రార్చన, మహా సౌరయాగం, సాయంత్రం 5 గంటలకు సరస్వతీ పూజ, 6 గంటలకు దివ్యనామ సంకీర్తన జరుగుతాయని, భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ కోరింది.



దత్త విజయానంద స్వామీజీ ఆలయ ట్రస్టీలు, భక్తులు

బ్యాటరీ సైకిళ్ల సీజ్ బాధాకరం : నారాయణ

● బ్యాటరీ ట్రై సైకిళ్లకు రూ.25లక్షలు ఇస్తానని హామీ



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 14 : నిరుపేదలకు పంపిణీ చేసే బ్యాటరీ ట్రైసైకిళ్లను అధికారులు సీజ్ చేయడం బాధాకరమని మాజీ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. 16వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ కూడా రాలేదని ఎవరో నాయకుడు చెప్పాడని అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తే భవిష్యత్తులో బాధపడతారని హెచ్చరించారు. అక్రమంగా మద్యం తరలిస్తుంటే సీజ్ చేస్తే తప్పులేదని, నిరుపేదలకు ట్రై సైకిళ్లు ఇస్తుంటే సీజ్ చేయడం దుర్మార్గమన్నారు. 28వ డివిజన్‌లోని పేదలందరికి ట్రై సైకిళ్ల కోసం రూ.25 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. నెల్లూరు నగరాన్ని చండీఘడ్ మోడల్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాన న్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే ఇచ్చిన హామీలతోపాటు సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. జగన్‌ది సుపరిపాలన కాదని నిరంకుశ పాలనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటరు జాబితాపై ఇప్పటికే కలెక్టర్, కమిషనర్‌ను కలిశానని, అన్నీ సక్రమంగా జరగకుంటే కోర్టుకు వెళతానని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఏకకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, రెండు నెలల్లో జగన్ ఇంటికెళ్లడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు. కాగా, 48వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే మొదట భూగర్భ డ్రైనేజీతోపాటు అక్కడక్కడా మిగిలిపోయిన రోడ్లను పూర్తి చేస్తానని ప్రకటించారు. ఏపీలో తప్ప దేశంలో ఎక్కడా ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయలేదన్నారు. అదికూడా ఆటోమేటిక్ ఎల్ఈడీ దీపాలని చీకటి పడగానే వెలగడం, తెల్లవారగానే ఆగిపోవడం జరుగుతుందని వివరించారు. జగన్ ప్రభుత్వం వచ్చాక వాటిని నాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదర్శనీయుడు దామోదరం సంజీవయ్య

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 14 : మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయుడని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కామంచి రమేష్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సంజీవయ్య 104వ జయంతి కార్యక్రమం జరిగింది. రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగానూ సంజీవయ్య సాధారణ జీవితం గడిపారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఐటీడీఏ పీవో మందారాణి, పల్లం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

దామోదరం సంజీవయ్య విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని దామోదరం సంజీవయ్య విగ్రహ కమిటీ చైర్మన్ పల్లం వెంకయ్య ప్రభుత్వాన్ని కోరారు. అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సంజీవయ్య జయంత్యుత్సవంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని వనంతోపు సెంటర్‌లో సంజీవయ్య విగ్రహాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుంటామని, స్థలం కేటాయించాలని కోరారు. కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘురాం ముదిరాజ్, కే వెంకట సుబ్బయ్య, కుడుముల సుబ్బారావు, జీ మహేష్, కట్టా సురేష్, నిర్మలమ్మ, ప్రమీలమ్మ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 : మూలస్థానేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలకు బుధవారం గుంజ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పూజలకు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పీ అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ధర్మకర్తలు ఈవో వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గల్లో పోటీకి సిద్ధం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్



మాట్లాడుతున్న భరత్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 14: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే రాష్ట్రంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయని, హత్యలు, అరాచకాలకు అడ్డాగా మారిన వైసీపీ పతనం మొదలైందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులను ప్రజలు చెప్పులతో తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 ఉంచి 29 వరకు నిర్వహించే బీజేపీ ప్రజాపోరు కార్యక్రమంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న నిధులు, సంక్షేమ పథకాలను వివరించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున దొంగ ఓట్ల నమోదు జరిగిందని, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డికి రెండు చోట్ల ఓటు ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో నాయకుడు కరణం భాస్కర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌కు హోండా యాక్టివా వాహనాలు



వాహనం అందజేస్తున్న హోండా షోరూం అధినేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 14: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి రూరల్ మార్కెటింగ్ కోసం శ్రీ షిర్డిషా హోండా డీలర్స్ వారు 30 హోండా యాక్టివా డీలక్స్ వేరియంట్ వాహనాలను బుధవారం అందజేసింది. నగరంలోని దర్గామిట్టలో గల హోండా షోరూమ్ నుంచి ఈ వాహనాలను డెలివరీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ హెడ్ కే జోగారావు మాట్లాడుతూ హెచ్ఎంఎస్ఐ కంపెనీ వారు ద్విచక్ర వాహన తయారీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్నారన్నారు. శ్రీ షిర్డిషా హోండా ఫౌండర్ కొండా బలరామిరెడ్డి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ వారికి ద్విచక్ర వాహనాలివ్వడం ఆనందంగా ఉందన్నారు. హోండా ఎండీ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మా వాహనాలు తీసుకున్న యూనియన్ బ్యాంకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాయని, ఈ వాహనాలకు సర్వీస్‌లో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రయారిటీ కస్టమర్‌గా సర్వీస్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డిషా హోండా సీజీఎమ్ రవికుమార్, మేనేజర్ మీరామొహిద్దిన్, హరి, వర్క్స్ మేనేజర్ దయాకర్ పాల్గొన్నారు.

వైభవంగా వసంత పంచమి



కన్యకాపరమేశ్వరి ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న లలితా శివకుమార్‌స్వామి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 : వసంత పంచమి పర్వదినం సందర్భంగా నగ రంలోని ఆలయాల్లో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అర్చకుడు లలితా శివకుమార్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి వారి నాలుకపై బీజాక్షరాలు రాశారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో సరస్వతీదేవి చిత్రపటానికి, ఉత్సవ మూర్తికి విశేష అలంకారం, పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేద పండితుడు రామకృష్ణశర్మ, అర్చకులు బాలబాలికలకు అక్షరాభ్యాసం జరిపారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఏసీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● మూలస్థానేశ్వర ఆలయంలోని సరస్వతి అమ్మవారి సన్నిధిలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవ, హోమం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు, ఈవో ఆరంబాకం వేణుగోపాల్, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

రేపు రంగడికి సప్తవాహన సేవలు

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా సప్తవాహన సేవలు వైభవంగా జరుగుతాయని ఆలయ ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సేవలు ఉదయం 6 నుంచి సాయంత్రం 7గంటల వరకు జరుగుతాయని భక్తులందరూ తరలిరావాలని కోరారు.

అమర జవాన్లకు నివాళులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 14: కశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రదాడిలో అమరులైన 40 మంది వీర జవాన్లకు నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్‌లో బుధవారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పార్టీ నాయకుడు పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ అమరజవాన్ల త్యాగాలను అందరూ స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, బైరి శ్రీనివాసులు, మురగ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పనులు పూర్తి చేయండి

● మంత్రి సురేష్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 : నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయ పునర్నిర్మాణ పనులను ఎన్నికల కోడ్ రాక ముందే పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. టిడ్కో గృహాల ప్రారంభోత్సవానికి బుధవారం నగరానికి విచ్చేసిన మంత్రిని మరో మంత్రి ఆదాల క్యాంపు కార్యాలయంలో జాషువా గ్రంథాలయం కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఖాసిం, సభ్యుడు కృష్ణయ్య కలిశారు. గ్రంథాలయ పునర్నిర్మాణ పనుల పురోగతిని వివరించి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేసి, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో గ్రంథాలయ నిర్మాణం పనులను ఎన్నికల కోడ్ వచ్చేలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్‌ను మంత్రి ఆదేశించారు.

కాలం చెల్లిన మందులు అమ్మితే చర్యలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 : పురుగు మందుల దుకాణాల్లో వ్యాపారులు కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు ఏడీఏ ఎన్ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ప్రాంతాలు, నగరంలోని పలు దుకాణాల్లో వారు ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో రైతులకు నాణ్యమైన మందులు మాత్రమే విక్రయించాలని, వాటిని ఎమ్మార్పీకే అమ్మాలని ఆదేశించారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కావాలి

● పల్లాల శ్రీనివాసులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 14 : మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మాదిగలకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. నెల్లూరు జిల్లాలో రెండు స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేయాలన్నారు. నగరంలో వచ్చేనెల మాదిగల రాజకీయ గర్జన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మన ఎమ్మార్పీఎస్ కండువాలను ఆవిష్కరించారు. సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పల్లాల సునీత, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదురు రత్నం, ఏపీ ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా నాయకుడు ఏలపల్లి శ్రీనివాస్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకులూరి శ్రీనివాసులు, మీడియా ఇన్‌చార్జి సగిలి గురవయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు పల్లం వన్నం కుమార్ పాల్గొన్నారు.

ఆపే క్లాసిక్ లోక్స్ ప్లస్ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 14 : నగరంలోని పియాగో ఆపే ఆటో నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఆథరైజ్డ్ షోరూమ్ విజన్ ఆటో మొబైల్స్‌లో బుధవారం ఆపే క్లాసిక్ లోక్స్ ప్లస్ ఆటో ఆవిష్కరణ జరిగింది. కొనుగోలుదారులకు పలు ఆఫర్లు ప్రకటించారు. నూతన మోడల్ సౌకర్యంగా ఉండటమేకాక అత్యధిక మైలేజీ ఇస్తుందని విజన్ ఆటోమొబైల్స్ అధినేత కారి పూర్ణచంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం రఘురామ్, శ్రీరామ్, ఆర్‌బీఎం స్వామి, ఫైనాన్షియర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలి : కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14 : జగన్ సీఎం అయ్యాక చిన్నాభిన్నమైన ఏపీకి అనుభజ్ఞుడైన చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం వేదగిరి క్షేత్రం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తూ దేవరపాళెంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. అనంతరం సురేంద్రరెడ్డి, ముత్తంశెట్టి శీనయ్య మిత్రబృందానికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వెంకయ్యనాయుడు, ప్రదీప్, జెన్ని రమణయ్య, జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

వైసీపీకి ఝలక్...!

- టీడీపీలో చేరిన ముగ్గురు జడ్పీటీసీలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: అసమ్మతి నేతలు వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు. ముగ్గురు జడ్పీటీసీలతో పాటు ఓ మాజీ జడ్పీటీసీ అధికార పార్టీకి గుడ్‌బై చెప్పారు.శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చన దేవి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వ్యాపారి హరి నాయుడు వైసీపీలో అసంతృప్తితో కొన సాగుతున్నారు. టీడీపీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వారంతా బుధవారం సాయంత్రం మంగళగిరిలో ప్రత్యక్షమయ్యారు.టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఒక్కసారిగా నలుగురు కీలక నేతలు అధికార పార్టీని వీడడంతో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. ఏకగ్రీవంగా ఎన్నికైన నేతలు కూడా వెళ్లిపోవడంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది.త్వరలోనే పెద్దసంఖ్యలో ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.కాగా శ్రీకాళహస్తి వైసీపీలో అసమ్మతి కలవరం మొదలైందని తొమ్మిది నెలల ముందే ఆంధ్రజ్యోతి చెప్పింది.గత ఏడాది మే 8వ తేది బొజ్జల నివాసంలో జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథ రెడ్డి తొలి వర్ధంతి నాడు పలువురు వైసీపీ కీలక నాయకులు బొజ్జల సోదరులకు ఘనంగా నివాళులర్పించారు.తరువాత బొజ్జల కుటుంబంతో చాలా సేపు భేటీ అయ్యారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో తమ పార్టీలో ఎలాంటి అసమ్మతి లేదని వైసీపీ చెప్పుకుంది. ఆ రోజు ఆంధ్రజ్యోతి ప్రస్తావించిన పేర్లలో ఇద్దరు తప్ప దాదాపు అందరూ బుధవారం టీడీపీలో చేరిపోవడం గమనార్హం.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీలు, నాయకులు

రైతుపై గజ దాడి



కాకర్లవారిపల్లె సమీపంలో ఏనుగులు



గాయపడిన మనోహర రెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 14: చంద్రగిరి మండలం, చిన్నరామాపురం పంచాయతీలోని యల్లంపల్లెలో పంట పొలాలను ధ్వంసం చేసిన ఏనుగులు ఓ రైతుపై దాడి చేశాయి.20 రోజులకు పైగా మూలపల్లి, భీమవరం, చిన్నరామాపురం, శేషాపురం అటవీ ప్రాంతంలో పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే.మంగళవారం రాత్రి యల్లంపల్లెకు చెందిన మనోహర్‌రెడ్డి తన పొలం వద్ద మంచంపై నిద్రిస్తుండగా ఏనుగులు దాడి చేశాయి.రైతు మనోహర రెడ్డి కేకలు వేయడంతో గ్రామస్తులు అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాణాసంచి కాల్చి ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమారు.గాయపడిన మనోహర రెడ్డిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా ఏనుగు దాడిలో గాయపడిన మనోహరరెడ్డిని బుధవారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పరామర్శించారు.





ఏనుగు దాడిలో ధ్వంసమైన మంచం - వరి పంటను తొక్కుకొంటూ వచ్చిన ఏనుగు

కాకర్లవారిపల్లె పొలాలపై ఏనుగుల దాడి

పాకాల, ఫిబ్రవరి 14: పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లె సమీపంలో పంటపొలాలపై బుధవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. ఐరాల మండలం చుక్కావారిపల్లె సమీపంలో కూడా పంటపొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి.

ఉద్యోగుల పోరుబాట

ఏపీ జేఏసీ పిలుపుతో జిల్లావ్యాప్తంగా నిరసనలు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ సురేష్‌బాబు, నిర్మల తదితరులు


తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల సాధనకు ఏపీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తిరుపతిలో కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ జిల్లా శాఖ చైర్మన్ ఎస్.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశాను కలసి వినతి పత్రం అందజేశారు. రుయా ఆస్పత్రిలో సైతం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. గూడూరులో ప్రభుత్వ ఐటీఐ కళాశాలతో సహా అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, ఆర్డీవో, ఆర్ అండ్ బీ తదితర కార్యాలయాల వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు గుమిగూడి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంకటగిరిలో తహసిల్దారుకు, బాలాయపల్లిలో తహసిల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రాలు అందజేశారు. సత్యవేడు, పుత్తూరు డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగులు సైతం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సత్యవేడు ఆత్మా కార్యాలయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. వరదయ్యపాలెం, చంద్రగిరి, పాకాల తదితర మండలాల్లో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆయా తహసిల్దారు కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయడంతో పాటు తహసిల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు.

టీపీకోటలో మూషిక జింక



నాగలాపురం, ఫిబ్రవరి 14 : నాగలాపురం మండల పరిధిలోని టీపీ కోట గ్రామంలో అరుదైన మూషిక జింక (మౌస్ డీర్) దర్శనమిచ్చింది. రెండు రోజులకు మునుపు గ్రామానికి చెందిన షారుక్ అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్దకు వెళ్తుండగా మూషిక జింక కనిపించింది. కాసేపటి తరువాత అది అడవిలోకి వెళ్లిపోయింది. నల్లమలై అటవీ ప్రాంతాల్లో కన్పించే ఈ మూషిక జింక గతంలో దాసుకుప్పం అటవీ ప్రాంతంలో కనిపించినట్లు సత్యవేడు ఎఫ్ఆర్వో జయప్రసాద్ రావు తెలిపారు.

ఎస్వీ జూపార్కుకు రెండు బెంగాల్ టైగర్స్



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు బెంగాల్ టైగర్స్ వచ్చాయి. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని నవాబ్ వాజాద్ అలీషా ప్రాగ్రి ఉద్యానవనం నుంచి రెండున్నర సంవత్సరాల వయసు గల ఒక మగ పులి, ఎనిమిదన్నర సంవత్సరాల వయసున్న ఆడపులిని తిరుపతికి తీసుకువచ్చినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. పులుల కొత్త జాతులను పెంపొందించాలనే ఉద్దేశంతో వీటిని తీసుకువచ్చామన్నారు. రెండు వారాల పాటు క్వారంటైన్‌లో ఉంచి తరువాత ప్రజల సందర్శనార్థం ఎన్‌క్లోజర్‌లో వదలడం జరుగుతుందని తెలిపారు. కాగా ఇప్పటికే జూలో 5 బెంగాల్ టైగర్స్ వున్న విషయం తెలిసిందే.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 14: రానున్న సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్, ఆర్వో శుభం బన్సల్ అన్నారు. బుధవారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళాశాలలో సెక్టారు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 298 పోలింగ్ బూత్‌ల పరిధిలో 3లక్షలు ఓటర్లు ఉన్నారని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రతి వంద మీటర్లకు మార్జిన్ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో సీఆర్వో కోదండరామిరెడ్డి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



కరపత్రాలను అందజేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 14: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, పేదలకు సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక అశోక్ నగర్ ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు డ్వాక్రా రుణాలను అందచేసి ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనను తరిమికొట్టి రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కరరెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఆరికట్ల మస్తాన్ నాయుడు, నర్సింహులు నాయుడు, జనార్దనరెడ్డి, రమణయ్య, పెంచలయ్య, శ్రావణి, గుండా లీలావతి, భారతి, ప్రకాశం, శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కోట, ఫిబ్రవరి 14: చిట్టమూరు మండలం బయ్యావారి కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న సుబ్బయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుధవారం కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సుబ్బయ్య కుటుంబానికి అంగన్‌వాడీ అసోషియేషన్ తరపున రూ.44 వేలు అందజేశారు. కార్యక్రమంలో పద్మలీల, సంఘనమ్మ, సరోజమ్మ, కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, ఫిబ్రవరి 14: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే ఉద్యోగులందరికీ ఈహెచ్‌ఎస్ కార్డులు అందజేసి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదురహిత చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలాయపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మురహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలు, అరియర్స్ తొంభై శాతం నగదుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు, రవికుమార్, రామసుబ్బయ్య, కోటేశ్వరావు, రవినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఉద్యమ కార్యాచరణ

వెంకటగిరి, ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో రీ సర్వే డీటీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ అరియర్స్ ఇవ్వడంతో పాటు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుప్పటి ఫణీంద్ర, గిరిబాబు, కారంపూడి సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ఉస్మాన్ సుబ్రహ్మణ్యం, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాయిగుంటపాలెంలో రక్తదాన శిబిరం

వాకాడు, ఫిబ్రవరి 14: మండలంలోని రాయిగుంటపాలెం గ్రామంలో బుధవారం మాతృభూమి సేవ సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పన్నులు

ఆన్‌లైన్‌లో చెల్లించొద్దు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14: మున్సిపాలిటీ పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించొద్దని కమిషనర్ గంగాప్రసాద్ పట్టణ ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీకి చెల్లించవలిసిన పన్నులు, ఇతర అద్దెలు గుర్తుతెలియని వ్యక్తుల వద్ద చెల్లించవద్దని, అలాగే ఫోన్ పే ద్వారా పంపవద్దని చెప్పారు. నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెల్లించాలని కోరారు. సూళ్లూరుపేటలో రెండురోజుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫోన్‌చేసి ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజులు ఫోన్ పే ద్వారా చెల్లించాలని కోరుతున్నారు. కొందరు పన్నులు చెల్లించిన వారికి ఫోన్‌చేయడంతో వారు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఇదంతా సైబర్ నేరగాళ్ల పనేనని, బ్యాంకు ఖాతాల నుంచే కాకుండా కొత్తకొత్త మార్గాలను ఎంచుకుని ప్రజలకు టోకరా వేస్తున్నారని తేలింది. 9391717856 నెంబరు నుంచి ఫోన్‌చేసి ఫోన్‌పే ద్వారా పన్నులు చెల్లించాలని నగదును గుంజేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ప్రజలను అప్రమత్తం చేస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

లారీని ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 14: దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ వంతెన వద్ద బుదవారం ఆగి ఉన్న లారీని మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సూళ్లూరుపేట మండలం ఇలుపూరు గ్రామానికి చెందిన ప్రసన్న, ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. వీరు నాయుడుపేట నుంచి సూళ్లూరుపేట వైపు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా నెలబల్లి సమీపంలో ఆగిఉన్న లారీని ఢీకొన్నారు. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

నలుగురు మహిళలకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 14: నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. మేనకూరులోని వివిధ పరిశ్రమల్లో పనిచేసే మహిళలు ఆటోలో బయలుదేరారు. మేనకూరు సమీపంలో వెళ్తుండగా ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సురేఖ తీవ్రంగా గాయపడగా సులోచన, వజ్రమ్మ, జ్యోతి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం సురేఖ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రమేష్



బాలాయపల్లి, ఫిబ్రవరి 14: ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా బాలాయపల్లి మండలం చుట్టి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్టీయూ నూతన కమిటీలో వెంకటగిరి నుంచి రాష్ట్ర కౌన్సిలర్‌గా పీవీ రత్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరావు, అసోసియేట్ అధ్యక్షులుగా సీహెచ్ కృష్ణయ్య, సర్వేశ్వరరావు, మైనారిటీ కన్వీనర్‌గా మీర్జా గయాజుద్దీన్ ఎన్నియ్యారు.

సామూహిక అక్షరాభ్యాసం

గూడూరు, ఫిబ్రవరి 14: స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో బుధవారం వసంత పంచమి సందర్భంగా ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విష్ణువందన, జమున, స్నేహలత, సనత్‌కుమార్‌రెడ్డి, రవిచంద్ర, రమణయ్య, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి శంకుస్థాపన

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 14: బంగారుపేట 2వ వార్డులోని చాముండేశ్వరి వీధిలో ఉన్న రామలింగ చాముండేశ్వరి ఆలయ నిర్మాణానికి వైసీపీ కన్వీనర్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు.

సామాజిక తనిఖీలపై సమీక్ష

కోట, ఫిబ్రవరి 14: ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీడీ వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. మండలంలో 21 పంచాయతీలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి గురువారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు జరగనున్నాయన్నారు.

వైసీపీని సాగనంపుదాం: జనసేన

బాలాయపల్లి, ఫిబ్రవరి 14: వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపుదామని జనసేన కన్వీనర్ గూడూరు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని మన్నూరు గ్రామంలో 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. పగడాన వెంకటరమణయ్య, ఉప్పు గురుస్వామి, ఉప్పు అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతు దగా

ముందొక ధర.. కోతలయ్యాక మరో ధర

కనిపించని కొనుగోలు కేంద్రాలు



పొలాల్లోనే విక్రయించి లారీలో లోడు చేస్తున్న ధాన్యం బస్తాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14: ధాన్యం దళారుల పాలవుతోంది. కోతకు ముందు ఓ ధర.. తర్వాత మరో ధర ఇస్తూ వ్యాపారులు అందినకాడికి దోచేస్తున్నారు. సూళ్లూరుపేట డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్ అక్టోబరులో ప్రారంభం కాగా పలుచోట్ల ఆదిలోనే వరినాట్లు వేయడంతో జనవరి చివరిలోనే నూర్పిళ్లు మొదలయ్యాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ఉన్న ఆర్బీకేలు అలంకార ప్రాయంగా మారడంతో రైతులు దగా పడుతున్నారు. ప్రారంభంలోనే వరినాట్లు వేసిన పంటలు మిచౌంగ్ తుఫాన్ ప్రభావానికి నీటి మునిగి రైతులు చాలా వరకు నష్టపోయారు. ఉన్న అరకొర పంట చేతికొచ్చినా గిట్టుబాటు ధర లేకపోవంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 15 వేల హెక్టార్ల పైగా వరిపంట సాగుచేశారు. బీపీటీ 5209(పెద్దజిలకర), ఎన్ఎల్ఆర్ 34449(నెల్లూరు జిలకర), కేఎస్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048(షుగర్ లెస్) రకం సాగుచేయగా పలుచోట్ల వరికోతలు జోరుగా సాగుతున్నాయి. ఎకరాకు 15నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తోంది. పెట్టుబడులు మాత్రం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా ఖర్చు చేశారు. ఇంత చేసినా కొన్నిచోట్ల 15-20 బస్తాలు మించి దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. సూళ్లూరుపే మండలంలోని మంగళంపాడు, కోటపోలూరు, ఇలుపూరు, మంగానెల్లూరు, మన్నారుపోలూరు, ఆబాక, దేగలపాలెం, తడ మండలంలోని కొండూరు, గ్రద్దగుంట, మాంబట్టు, ఎన్ఎం కండ్రిగ, దొరవారిసత్రంలో కల్లూరు, శ్రీధనమల్లి, మేలుపాక, పూలతోట గ్రామాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులకు ధాన్యాన్ని దాచుకొనేందుకు గోదాముల సౌకర్యంలేదు. దీంతో దళారులను ఆశ్రయించి గిట్టుబాటు ధర లేకపోయినా అయిన కాడికి విక్రయించేస్తున్నారు.



కల్లాలు లేకపోవడంతో జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టిన రైతులు

పడిపోయిన ధరలు..

పంట కోత దశలో రికార్డు స్థాయిలో ఉన్న ధర రైతు చేతికి ధాన్యం గింజలు వచ్చేసరికి బాగా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వారం రోజుల కిత్రం పుట్టి ధాన్యం రూ.24,500 ఉండగా నేడు రూ.20,500 - 22,500 వరకు పడిపోయింది. ఇదే అదునుగా దళారులు రైతులకు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంకా ధరలు తగ్గిపోతాయన్న ఆందోళనతో రైతులు ధాన్యాన్ని పొలాలు, కళ్లాలోనే అమ్మి వచ్చిందే ఆదాయమని సొమ్ముచేసుకొంటున్నారు. బీపీటీ పెద్దజిలకర వారం రోజుల కిందట 75 కిలోల బస్తా రూ.2,200 పలికింది. ప్రస్తుతం రూ.రూ.1800కి పడిపోయింది. అదే విధంగా ఆర్ఎన్ఆర్ రకం రూ.1900కి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు మాత్రం రైతుల వద్దకొనుగోలు చేసిన మరుక్షణమే ఎక్కువ ధరకు ధాన్యం బస్తాలను అమ్ముకొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 14: సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రెండు రోజుల నుంచి తాగునీరు సరిగా పరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తల్లంపాడు చెరువు, పిండిపాలెం సమీపంలోని కోటపోలూరు పెద్దన్నగారి చెరువులో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు నుంచి పట్టణానికి డైరెక్టు పంపింగ్ ద్వారా పైపులైన్ల నుంచి గాంధ్లవీధిలోని సచివాలయం వద్దనున్న ట్యాంకును నింపి, అక్కడ నుంచి పట్టణంలోని అన్ని వార్డులకు తాగునీరందిస్తున్నారు. రెండు రోజుల కిత్రం ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఉన్న మోటారుకు విద్యుత్ ప్యానల్ బోర్డులో సాంకేతిక లోపం తలెత్తింది. మోటారు పనిచేయకపోవడంతో ఎస్ఎస్ ట్యాంకు నుంచి తాగునీటా సరఫరా ఆగిపోయింది. దీంతో రెండు రోజుల నుంచి తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ ప్యానల్ బోర్డుకు మరమ్మతులు చేసి తాగునీరు పరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యం పట్ల మహిళలు శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివానీచోప్రా

గూడూరు, ఫిబ్రవరి 14: ఆరోగ్యం పట్ల మహిళలు శ్రద్ధ తీసుకోవాలని శివానీచోప్రా అన్నారు. మహిళల ఆరోగ్య సమస్యల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శివానీచోప్రా చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాల వద్ద ఆమెకు ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళామండలి సభ్యులు స్వాగతం పలికి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేస్తూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ మహిళల నెలసరి రుతుక్రమ సమస్యల నివారణపై శివానీచోప్రా సైకిల్‌యాత్ర చేస్తూ అవగాహన కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విష్ణువందన, స్నేహలత, శశిరేఖ, లక్ష్మి, తనూజ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గూడూరు విద్యార్థి ప్రతిభ



దివ్యపూర్ణ చంద్

గూడూరు, ఫిబ్రవరి 14: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గూడూరు పట్టణంలోని నాగకోటేశ్వరరావు, స్వాతి దంపతుల కుమారుడు దివ్యపూర్ణ చంద్ 99.87 శాతం మార్కులు సాధించాడు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన దివ్యపూర్ణ చంద్ ప్రస్తుతం విజయవాడలో శ్రీచైతన్యలో చదువుతున్నాడు. స్థానిక శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు.

కార్బన్ బ్లాక్ పరిశ్రమకు శంకుస్థాపన



పరిశ్రమల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: రాష్ట్రప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేస్తోందని మంత్రి గుడివాడ అమరనాథ్ తెలిపారు. బుధవారం విజయవాడ నుంచి ఆయన జిల్లాలో రెండు పరిశ్రమలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట స్పెషల్ జోన్‌లో ఆదిత్యబిర్లా గ్రూప్ రూ.1,198కోట్లతో నెలకొల్పనున్న కార్బన్ బ్లాక్ తయారీ యూనిట్ ద్వారా 250మందికి ఉపాధి లభించనుందన్నారు.అలాగే హెల్లా ఇన్ఫ్రా రూ.350 కోట్లతో ఏర్పాటు చేయనున్న పీవీసీ పైప్స్, ఫిట్టింగ్ తయారీ ద్వారా 35మందికి ఉపాధి కలుగుతుందన్నారు. అలాగే వైజాగ్-చైన్నై కారిడార్‌లో రూ.423 కోట్లతో శ్రీకాళహస్తి-చిత్తూరు సౌత్ క్లస్టర్ స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ద్వారా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ తదితరాల ఏర్పాటుకు భూమిపూజ చేశారు.సంబంధిత పరిశ్రమల ప్రతినిధులతో కలిసి జిల్లాపరిశ్రమల శాఖ అధికారి ప్రతాపరెడ్డి, ఏపీఐఐసీ జడ్ఎం చంద్రశేఖర్, తిరుపతి స్పెషల్‌జోన్ అధికారి విజయరత్నం పాల్గొన్నారు.

మన్నూరులో పంటల కలెక్షన్ సెంటర్



కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దశరథరామిరెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని మన్నూరు గ్రామంలో క్షేత్రపతి రైతు సంఘం ఆధ్వర్యంలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను జిల్లా ఉద్యానశాఖ అధికారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ ప్రక్కల గ్రామాల రైతులు పండించిన పంటలను గ్రేడింగ్ చేసుకునేందుకు కలెక్షన్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే మామిడి, నిమ్మలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది నరసింహ, హేమంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

ఉదయం నుంచి రాత్రి వరకు వాహన సేవలు

తిరుమల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సూర్య జయంతి సందర్భంగా శుక్రవారం తిరుమలలో జరుగనున్న రథసప్తమికి టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. వేకువజాము నుంచి రాత్రి వరకు శ్రీవారు ఏడు వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు కూర్చునే గ్యాలరీలపై తాత్కాలిక షెడ్లు నిర్మించారు. తాగునీరు, మరుగుదొడ్లను సిద్ధం చేశారు. ఎండకు ఇబ్బంది లేకుండా నేలపై కూల్ పెయింట్ వేశారు. మాడవీధుల్లో సౌందర్యవంతంగా పెయింట్‌తో ముగ్గులు వేశారు.

వైసీపీ, బీజేపీ దోపిడీ పార్టీలు: కాంగ్రెస్

గూడూరు, ఫిబ్రవరి 14: రాష్ట్రాన్ని వైసీపీ, దేశాన్ని బీజేపీ దోచుకుంటున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక అశోక్‌నగర్, అరుంధతీయపాళెం తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం ఖనిజ వనరులను దోచుకుంటూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిని రాజధాని చేస్తేనే రాష్ట్రాభివృద్ధి: చింతా

వెంకటగిరి, ఫిబ్రవరి 14: తిరుపతిని రాజధానిగా చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోలేరమ్మ ఆర్చి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పంటా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు...

కుటుంబానికి ప్రోటోకాల్ దర్శనం.. లడ్డూ కార్డు ● ఎన్నికల వేళ తిరుపతి వైసీపీ నేత అలవికాని హామీలు

తిరుపతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇళ్ల స్థలాలు... కుటుంబానికి ప్రోటోకాల్‌తో శ్రీవారి దర్శనం... లడ్డూ కార్డు... టీటీడీ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సదుపాయాల కల్పన..! వింటుంటేనే సంతోషంతో మనసు ఎక్కడో తేలిపోతోంది కదా! సరిగ్గా ఇదే అనుభూతికి లోనయ్యారు బుధవారం తిరుపతి ఏపీ ఎన్‌జీవో భవన్‌లో సమావేశమైన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు. ఎన్నికల వేళ రోజూ వివిధ కులాలు, మతాలు, వర్గాలు, వృత్తిదారులతో వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న నగర డిప్యూటీ మేయర్, వైసీపీ ఇంఛార్జి భూమన అభినయ్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలివి. బుధవారం ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంచెలంచెల ఆందోళనకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అదే రోజు తిరుపతిలో డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి అనుకూలురైన కొందరు ఉద్యోగులు, ఎన్‌జీవో సంఘ నాయకులు స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటుకు యత్నించారు. కొందరిని బెదిరించి, మరికొందరిని బుజ్జగించి, ఇంకొందరిని హామీలతో ఊరించి మొత్తానికి 30మందిని పోగేశారు. అభినయ్‌రెడ్డిని ఆహ్వానించారు. వారితో సమావేశమైన యువనేత టీటీడీ ఉద్యోగుల తరహాలో తిరుపతిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని, కుటుంబాలతో శ్రీవారిని దర్శించుకునేలా ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు చేస్తామని, లడ్డూ కార్డులు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వింటున్న ఉద్యోగులు, ఎన్‌జీవో సంఘ నాయకులకు మతిపోయినంత పనైంది. టీటీడీని తమ సొంత సంస్థలా భావిస్తే తప్ప ఇలాంటి హామీలు ఇవ్వడం సాధ్యపడదని ఉద్యోగ వర్గాలకే చెందిన పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారం రెండు విధాలా దుమారం రేపుతోంది. టీటీడీని తమ రాజకీయ అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకునేందుకు యత్నిస్తుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. మరోవైపు రాష్ట్రమంతా ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు శ్రీకారం చుడితే తిరుపతిలో మాత్రం అదే అధికార పార్టీ నేతతో కూడా ఎన్‌జీవో భవన్‌లోనే ఆత్మీయ సమావేశం ఎలా నిర్వహించారన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిపైనా జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల నుంచీ ఎన్‌జీవో సంఘ నాయకులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బ తీసేలా కొందరు ఉద్యమ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



తిరుపతి ఎన్జీవో భవన్‌లో ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

పుల్వామా అమరవీరుల సంస్మరణ ర్యాలీ



విద్యానగర్‌లో ర్యాలీ చేపట్టిన ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం పుల్వమా అమరవీరుల సంస్మరణ ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారులు మధవయ్య, మల్లికార్జునరెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

గూడూరు, ఫిబ్రవరి 14: పుల్వామ దాడిలో వీర మరణం పొందిన జవాన్లకు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం కొవ్వొత్తులతో నివాళలర్పించారు. ఉమ్మడి నెల్లూరు జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, మోహన్, ఇంద్రవర్దన్, శ్వరూప్, మనోజ్‌కుమార్, సాయి, శివ పాల్గొన్నారు.



నివాళలర్పిస్తున్న జనసేన నాయకులు